తల్లడిల్లుతున్న పశ్చిమ తీరం

- ఎడతెరిపి లేకుండా వర్షం, ఈదురుగాలులు
- సముద్రంలో ఎగసిపడుతున్న అలలు
- అధికార యంత్రాంగం అప్రమత్తం
- వరుస సమీక్షలు.. జిల్లాలో పర్యటనలు
- పేరుపాలెం బీచ్ మూసివేత
- 16 పునరావాస కేంద్రాలు ఏర్పాటు


పీఎం లంక వద్ద ఎగిసిపడుతున్న సముద్ర అలలు

పశ్చిమ తీరంలో క్షణ క్షణం.. భయం భయంగా గడుస్తోంది. ఈ రాత్రి ఎలా గడుస్తుందా ? అని ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మొంథా తుఫాన్ ఏ దిశలో వెళుతుంది అని అంతా టెన్షన్‌గా ఎదురుచూస్తున్నారు. నిన్నటి వరకు కాకినాడ-తుని మధ్యలో తీరం దాటుందని చెప్పారు.. తాజాగా కాకినాడ-మచిలీపట్నం మధ్య మంగళవారం రాత్రి తీరం దాటే అవకాశం వుందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఆ సమయంలో ఎలాంటి విపత్తు సృష్టిస్తుందోనని అంతటా ఆందోళన నెలకొంది.

హై అలర్ట్

ఈ రాత్రి గడిస్తే చాలు.. క్షణక్షణం.. భయం భయం.. మొంథా తుఫాన్ దిశపై కలవరం

నరసాపురం/భీమవరం/భీమవరం టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):సముద్ర తీరప్రాంతంలో హైఅలర్ట్ ప్రకటించారు. అలలు ఎగిసిపడుతున్నాయి. పేరుపాలెం, పీఎం లంక వద్ద సముద్రం పది మీటర్ల మేర దూసుకొచ్చింది. తుఫాన్ తీరానికి సమీపిస్తున్న కొద్దీ సముద్రం మరింత కల్లోలంగా మారే అవకాశం ఉండటంతో మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. చినలంక, పీఎం లంక, కేపీ పాలెం, పేరుపాలెం, మోళ్ళపర్రు గ్రామాల మత్స్యకారులు బోట్లు, పడవలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పేరుపాలెం బీచ్‌లోని దుకాణాలను మూయించి వేశారు. పోలీసులు, ఎన్ ఆర్‌ఎఫ్, ఎస్టీఆర్‌ఎఫ్, మెరైన్ పోలీసులు బీచ్‌లో గస్తీ కాస్తున్నారు. కార్తీక సోమవారం పుణ్యస్నానాలు ఆచరించేందుకు సముద్రంలోకి భక్తులు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో 16 పునరావస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో సుమారు 15 వేల మందిని తరలించేందుకు సిద్ధమవుతున్నారు. తుఫాన్ తీవ్రతను గ్రామ స్థాయి సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరిస్తున్నారు. మంగళ, బుధవారాల్లో కచ్చితంగా ఇళ్ల నుంచి పునరావాస కేంద్రాలకు తరలి రావాలని సూచిస్తున్నారు. ఇప్పటికే అన్ని కేంద్రాల్లో నిత్యావసర వస్తువులు, జనరేటర్, మంచినీటి సౌకర్యాలతోపాటు మెడికల్ క్యాంపులను ఏర్పాటుచేశారు. ప్రతి కేంద్రం వద్ద ఒక స్పెషల్ అధికారిని నియమించారు.


పేరుపాలెం తీరంలో పోలీసుల పహారా


భీమవరంలో తుఫాన్‌కు సిద్ధం చేసిన ఇసుక బస్తాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం

వచ్చే మూడు రోజులు భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సోమవారం పరిశీలించారు.

స్తంభించిన జనజీవనం

మొంథా తుపాను ప్రభావంతో సోమవారం ముసురు వాతావరణం అలముకొంది. మోస్తరు వర్షాలు కురిశాయి. నర్సాపురం, మొగల్తూరు. భీమవరం, యలమంచిలి, వీరవాసరం, కాళ్ల మండలాల్లో మాత్రం ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. బలమైన ఈదురుగాలులు వీచాయి. జన జీవనం స్తంభించింది. ప్రజలు ఇంటి పట్టునే ఉన్నారు. మంగళవారానికి నాటికి తీవ్ర తుపానుగా మారనున్న నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురవనున్నట్టు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాత్రికి 90 నుంచి వంద కిలోమీటర్ల వేగంగా గాలులు వీచే అవకాశం వుంది. ఆ సమయంలో ఎవరూ బయటకు రాకూడదు. ఎలాంటి విపత్తు ఎదురైనా సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కు అందించాలి. రెండో రోజు మాధవాయిపాలెం, సఖినేటిపల్లి రేవులు మూసివేశారు. ఎక్కడి పడవలు అక్కడే నిలిచిపోయాయి. పంటులు గట్టుకే పరిమిత య్యాయి. పంటులు తిరగకపోవడంతో స్టీమర్ రోడ్ బోసిపోయింది. ప్రజలు చుట్టు తిరిగి నరసాపురం పట్టణానికి వచ్చారు.

తుఫాన్‌పై తక్షణం స్పందించండి

కాల్ సెంటర్ సిబ్బందితో కలెక్టర్ నాగరాణి

ప్రజల నుంచి వచ్చిన కాల్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 'పల్లపు ప్రాంతాలు ముంపునకు గురికావడం, చెట్లు పడిపోవడం, నిత్యావసర వస్తువుల కొరత, విద్యుత్ అంతరాయాలు, పునరావాస కేంద్రాల వద్ద తాగునీరు, శానిటేషన్, వైద్య సహాయం తదితర సమస్యలపై ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందించి సంబంధిత సమాచారాన్ని ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి. తుపాను తీరం దాటి పరిస్థితులు చక్కబడే వరకు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలి' అని సూచించారు. డీఆర్వో బి.శివనారాయణరెడ్డి, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, తదితరులు ఉన్నారు.

అధికారులు అప్రమత్తం

మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పటిష్టచర్యలు చేపట్టింది. ఉభయ గోదావరి జిల్లాల ప్రత్యేకాధికారి, రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా జిల్లా యంత్రాంగంతో సమీక్ష జరిపి సూచనలు చేశారు. జిల్లా ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేష్, కలెక్టర్ నాగరాణి, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి (మిగతా 8వ పేజీలో)


పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు


ఇరగవరంలో పడిపోయిన వరి పనలు

తుఫాన్ టెన్షన్

- డ్రెయిన్లు మొరాయిస్తే సాగుకు గండమే
- ఆరేళ్లలో డ్రెయిన్ల అభివృద్ధి అంతంతే
- లక్ష ఎకరాల్లో పంట చేజారుతుందా ?
- నిస్సహాయ స్థితిలో రైతులు

దేవుడిపైనే భారం

- ఎడతెరపిలేని వర్షాలకు చనిపోతున్న
- చేపలు, రొయ్యలు.. ఆక్వా రైతులు విలవిల
- ముందే మునిగిన మినుము రైతు

పలు రైళ్లు, విమాన సర్వీసులు రద్దు

- వివరాలు 6లో


పెద్దఎడ్లగాడి-పెనుమాకలంక రోడ్డుపైకి చేరిన గుర్రపుడెక్కతో చేరిన కొల్లేటి వరద.. అందులోనే గడ్డి మేస్తున్న పశువులు

కొల్లేరుకు వరద ఉప్పుటేరు ఉరకలు



ఆకివీడు రూరల్/కాళ్ల/కైకలూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):మొంథా తుపాను ప్రభావం కొల్లేటి సరస్సుపై పడుతోంది. వరద నీటితో సోమవారం పెద్దఎడ్లగాడి-పెనుమాకలంక రహదారిపై రెండు కిలోమీటర్లకు పైగా నాలుగు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. నందిగామకలంక, పెనుమాక లంక, ఇంగిలిపాకలంక, పులపర్రు వంటి గ్రామాల చుట్టూ నీరు చేరింది. కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రం వద్ద పోల్‌రాజ్ డ్రెయిన్ నుంచి నీరు కొల్లేరులోకి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆటపాక పక్షుల కేంద్రాన్ని పర్యాటకులు రాకుండా అటవీ శాఖ అధికారులు ముందస్తుగా మూసివేశారు. గోకర్ణపురం, పైడిచింతపాడు రోడ్డుపైకి వరదనీరు చేరింది. మంగళవారానికి ఇది మరింత పెరిగే అవకాశం వుంది. దీనిపై ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొల్లేరులో వేటకు, కూలీలు వివిధ ప్రాంతాలకు పనులకు వెళ్లవద్దని ప్రచారం చేస్తున్నారు. కొల్లేరు వరద కారణంగా ఉప్పుటేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కొల్లేరు నుంచి వచ్చే నీటితో ఉప్పుటేరు ఉరకలు వేస్తోంది. ఆకివీడు మండలం ఆకివీడు, సిద్దాపురం, మందపాడు, చెరుకుమిల్లి, కాళ్ల మండలం మోడి, గోగుతిప్ప, గాంధీ నగర్, ఇసుకలంక, ప్రాతాళ్లమెరక, పల్లిపాలెం, ఏలూ రుపాడు గ్రామాల మీదుగా ప్రవహిస్తున్న ఉప్పుటేరు అరడుగు మేర నీటిమట్టం పెరి గింది. మొంథా తుపాను నేపథ్యంలో కురిసే భారీ వర్షాలకు నీటి మట్టం మరింత పెరిగే ప్రమాదం వుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


మాధవరం-కంసాలిపాలెం మధ్య ఎర్రకాలువ పరిస్థితి

పొంగుతున్న ఎర్రకాలువ

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ఎర్రకాలువ పొంగి ప్రవహిస్తోంది. కొంగువారిగూడెం వద్ద వరద నీరు కిందకు పెంచి వదులుతుండటంతో తాడేపల్లిగూడెం మండలం మాధవరం, వీరంపాలెం, పట్టింపాలెం, కొమ్ముగూడెం, అప్పారావుపేట, జగన్నాథపురం, మారంపల్లి, నందమూరు, ఆరుళ్ల ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరో పది రోజుల్లో వరి పంట చేతికి వస్తుందన్న సమయంలో తుఫాన్, ఎర్ర కాలువ ముంపుతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

నష్టాన్ని తగ్గించేలా చర్యలు

- తుఫాన్ ప్రత్యేక పర్యవేక్షకులు సిసోడియా

భీమవరం టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్‌ను నూరు శాతం సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ఠ ఏర్పాట్లు చేసిందని కోస్తా జిల్లాల తుఫాన్ ప్రత్యేక అధికారి, రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా తెలిపారు. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మొంథా తుఫాన్ మంగళవారం రాత్రి మచిలీపట్నం-కాకినాడ మధ్య తీరం దాటవచ్చు. ఈ నేపథ్యంలో నష్టాన్ని తగ్గించుకునేందుకు వీలుగా కమ్యూనికేషన్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టాం. జిల్లాలో 26 పక్కా భవనాలలో 16 పునరావాస కేంద్రాలను,




నరసాపురంలో ఒక ఎన్డీఆర్‌ఎఫ్ బృందాన్ని సిద్ధం చేశాం. గర్భిణులను, వృద్ధులను పీహెచ్‌సీలకు తరలించాం. 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున పట్టణాల్లోని డివైడర్ల మధ్య వున్న హోర్డింగ్‌లను తొలగించాలని, మంగళవారం సాయంత్రం రోడ్లపై ప్రైవేట్ వాహనాలు తిరగకుండా నిరోధించాలని ఆదేశాలు ఇచ్చాం. సమీక్ష సమావేశంలో కలెక్టర్ నాగరాణి, ఎస్‌పి నయీం అస్మి, జిల్లా ప్రత్యేక అధికారి ప్రసన్నవెంకటేష్ పాల్గొన్నారు.

నేడు ఎమర్జెన్సీ వాహనాలకే అనుమతి : ఎస్పీ

భీమవరం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి)'మొంథా తుపాను వేళ ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి. అత్యవసరమైతే తప్ప ఇంటిలో నుంచి ఎవరూ బయటకు రావద్దు. మంగళవారం మధ్యాహ్నం నుంచి ఎమర్జెన్సీ వాహనాలను మాత్రమే రోడ్లపైకి అనుమతిస్తాం. సాధారణ వాహనాలను నిలిపివేస్తాం' అని జిల్లా ఎస్పీ నయీం అస్మి సోమవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. 'తుఫాన్ నేపథ్యంలో జిల్లా అంతటా ప్రత్యేక షెల్టర్లు ఏర్పాటు చేశాం. తీరప్రాంతాల ప్రజలు ముందుగానే షెల్టర్లకు వెళ్లాలి. మచిలీపట్నం, కాకినాడ మధ్యలో తుపాను తీరం దాటుతున్న నేపథ్యంలో జిల్లాపై ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. నరసాపురం, మొగల్తూరు, భీమవరం, ఆకివీడు, ఉండి ప్రాంతాల వారు జాగ్రత్తలు పాటించాలి. ఇప్పటికే ఎన్‌డీఆర్‌ఎఫ్ ప్రత్యేక టీమ్‌లు జిల్లాకు వచ్చాయి. కార్తీక మాసం సందర్భంగా సముద్ర స్నానాలకు, కాలువలు, నదుల్లోకి దిగవద్దు' అని సూచించారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాలకు సీఎం !



భీమవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):తుఫాన్ ప్రభావిత పశ్చిమ గోదావరి లేదా కాకినాడ జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒకటి, రెండు రోజుల్లో పర్యటించే అవకాశం ఉన్నట్టు సమాచారం. దీనిపై స్పష్టత రావాల్సి వుంది. జిల్లా ఎస్పీ నయీం అస్మి మాత్రం సీఎం పర్యటనపై సోమవారం రాత్రి వరకు ఎలాంటి సమాచారం లేదని చెబుతున్నారు. మరోవైపు తుఫాన్ ప్రభావం, అధికారుల సంసిద్ధతపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, ఎస్పీలతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. ప్రాణనష్టం జరగకుండా చూడాలని అప్రమత్తం చేశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు.

ఈజీగా రాసేద్దాం


ఇంటర్ ఫస్టియర్ పరీక్ష విధానంలో మార్పులు

- ఎంపీసీలో మ్యాథ్స్‌కు రెండు కాదు.. ఒకటే పరీక్ష
- బైపీసీలో బోటనీ, జువాలజీ కలిపి బయాలజీ
- ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు మార్కుల పెంపు
- మ్యాథ్స్ 100 మార్కులు, బయాలజీ 85 మార్కులు
- జిల్లాలో 19,703 విద్యార్థులకు కొత్త విధానంలో పరీక్షలు

ఎంపీసీ, బైపీసీల్లో ఇకపై ఐదు పరీక్షలే

భీమవరం రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యా విధానంలో కూటమి ప్రభుత్వం అనేక మార్పులు చేస్తోంది. ఇందులో భాగంగా ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులలోని ఆరు పరీక్షలను ఐదింటికి కుదించింది. ఈ నేపథ్యంలో సబ్జెక్టుల మార్కులు మారాయి. ఎంపీసీ మార్కులు మొత్తం 500. రాత పరీక్షలకు 470, ప్రాక్టికల్స్ (కెమిస్ట్రీ 15+ఫిజిక్స్ 15) 30 మార్కులు. ఇప్పటి వరకు మ్యాథ్స్ సబ్జెక్టును రెండు పేపర్లుగా నిర్వహిస్తున్నారు. పేపర్ 1ఏకి 75 మార్కులు, పేపర్ 1బికి 75 మార్కులు మొత్తం 150 మార్కులతో పరీక్షలు జరిగేవి. ఇకపై 100 మార్కులతో ఒకే పేపరు నిర్వహిస్తారు. పాస్ మార్కులు 35. ఫిజిక్స్ 85, కెమిస్ట్రీ 85, ఫస్ట్, సెకండ్ లాంగ్వేజెస్‌కు వంద మార్కులు చొప్పున రెండు పరీక్ష పత్రాలు ఇస్తారు.

బైపీసీలో మార్కులు మొత్తం 500. రాత పరీక్షలకు 455, ప్రాక్టికల్స్ (కెమిస్ట్రీ 15 + ఫిజిక్స్ 15+బోటనీ, జువాలజి 15) 55 మార్కులు. బోటనీ 60 మార్కులకు, జువాలజీ 60 మార్కులకు రెండు పేపర్లు ఉండేవి. ఇప్పుడు ఈ రెండు కలిపి 85 మార్కులుగా ఒకే ప్రశ్నాపత్రంగా ఇస్తారు. ఆన్సర్ షీట్‌లు మాత్రం రెండుగా ఉంటాయి. బోటనీ 43 మార్కులు, జువాలజీ 42 మార్కులుగా ప్రశ్నలు ఉంటాయి. ఉత్తీర్ణత 29.5



మార్కులుగా నిర్ధారించారు. కాని అరమార్కు వుండదు. 29 మార్కులు వస్తే ఉత్తీర్ణతగా తీసుకుంటారు. ఫిజిక్స్ 85కి, కెమిస్ట్రీ 85 మార్కులకు ఉంటుంది. ఫస్ట్, సెకండ్ లాంగ్వేజెస్‌కు వంద మార్కుల చొప్పున పరీక్ష పత్రాలు ఇస్తారు. ఈ విధానంలో ఫస్టియర్ పరీక్షలు రాసిన విద్యార్థులు.. సెకండ్ ఇయర్‌లోనూ కొనసాగిస్తారు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాత విధానంలోనే ప్రశ్నాపత్రాలు ఉంటాయి.

ఫస్టియర్ విద్యార్థులు 19,703

జిల్లాలో 146 ఇంటర్ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి 19,703 మంది విద్యార్థులు ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు రాయనున్నారు. వీరిలో సోషల్ వెల్ఫేర్ ఒకటి నుంచి 110 మంది, ఒకేషనల్ 373, ఎయిడెడ్ 651, ప్రభుత్వ 1,625, ప్రైవేట్ 16,647, హెచ్‌ఎస్ ప్లస్ నుంచి 297 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రభుత్వ కళాశాలలు, ప్లస్ 2 కళాశాలల్లోని విద్యార్థులకు ప్రశ్నాపత్రాలపై అవగాహన పెంచేందుకు ఓరియంటల్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు ప్రశ్నాపత్రాలు రూపకల్పన చేసి వాటి విధానాన్ని అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థుల్లో ఉత్తీర్ణత పెంచే దిశగా విద్యా బోధన జరుగుతోంది.


విజయవాడలో ఆందోళన చేస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు

సిబ్బంది సమ్మెతో మూతపడిన సొసైటీలు

భీమవరం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):తమ సమస్యల పరిష్కారం కోసం సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం ఒకరోజు సమ్మెతో సొసైటీలు మూతపడ్డాయి. ఉద్యోగులంతా విజయవాడ ఆప్కాబ్ కార్యాలయం వద్దకు వెళ్లి ధర్నా చేశారు. జిల్లాలోని 122 సొసైటీల్లో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించలేదు. జీవో నెంబరు 36ను ఉపసంహరణ, పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు, పనిభారం, సిబ్బంది నియామకం వంటి అంశాల పరిష్కారం కోసం ఆందోళన చేపట్టారు.



హరహర మహాదేవ..

కార్తీక సోమవారం సందర్భంగా పంచారామ క్షేత్రమైన భీమవరం గునుపూడి సోమేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకం చేస్తున్న అర్చకులు 7లో..

గురువా.. ఎందుకీ ఆలస్యం?!

- ఏలూరు జిల్లాలో ఆలస్యంగా హాజరైన టీచర్లు 2018 మంది! 7
- ఉదయం 9 గంటలకే అటెండెన్స్ : డీఈవో ఆదేశం


గునుపూడి సౌత్ వద్ద నిండుగా ప్రవహిస్తున్న డ్రెయిన్


డ్రెయిన్లు మొరాయిస్తే సాగుకు గండమే

గడిచిన ఆరేళ్లలో డ్రెయిన్ల అభివృద్ధి అంతంతే

భీమవరం రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం ప్రభావంతో ఎడతెరపి లేని వర్షాలు కురుస్తున్నాయి. సార్వా వరిచేలల్లోకి వర్షపు నీరు చేరుతుంది. ఈ సమయంలో మురుగు డ్రెయిన్‌లు మొరాయిస్తే సాగుకు గండం తప్పదు. నాలుగు రోజుల క్రితం అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాలకు డ్రెయిన్ నిండుగా ప్రవహిస్తుంది. మళ్లీ మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణం శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మురుగు డ్రెయిన్ పైనే సార్వా సాగు ఆధారపడింది. గడిచిన ఆరేళ్లలో మురుగు డ్రెయిన్ అభివృద్ధి అంతం మాత్రంగానే జరిగింది. ఇప్పుడు సాగును ముంచేలా మారింది. జిల్లాలో మేజర్, మైనర్ డ్రెయిన్‌లు దాదాపు 120 ఉన్నాయి. ప్రస్తుతం సాగు చేసిన సార్వా సాగు రెండు లక్షల ఎకరాలు ఈ డ్రెయిన్‌లపైనే ఆధారపడి ఉంది. గడిచిన మేలోనే డ్రెయిన్‌లో చెత్త తొలగించారు. మట్టి పూడికతీతలకు నోచుకోలేదు.

అయోమయంలో రైతన్నలు

- లక్ష ఎకరాల్లో పంటకు ముప్పు
- తుఫాన్‌తో కష్టం చేజారుతుందా ?




భీమవరం రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావం పశ్చిమ గోదావరి జిల్లాపై అతిగా చూపించడంతో రైతన్నలు అయోమయంలో పడ్డారు. పంటను గట్టెక్కించే అవకాశాలు ఏమాత్రం లేనందున గందరగోళం నెలకొంది. జిల్లాలో దాదాపుగా లక్ష ఎకరాలకు మరింత గండంగా మారింది. ఈనిక, పాలు పోసుకునే దశలో ఉన్నందున ఈదురుగాలులు, భారీ వర్షాలకు నీటమునిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే కొన్నిచోట్ల వరిచేలు నీళ్ల పాలవుతున్నాయి. పంట మాసూళ్ల దశకు చేరుకున్న ధాన్యం రాశులుగా ఉన్న రైతులు వాటిని చాలా వరకు గట్టుకు చేర్చుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు ఏమీ చేయలేని దీనస్థితిలో రైతన్నలు తుఫాన్ ప్రభావం తక్కువ ఉంటే బాగుండును అని వేడుకునే పరిస్థితుల్లో ఉన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రొయ్యల చెరువులలో నీటిమట్టం పెరిగింది. మళ్లీ వర్షాలు ఎక్కువయితే చెరువుల గట్లు మునిగి నష్టం చేకూరుస్తుందని రైతులు ఆందోళనలో ఉన్నారు.

మొంథా గండం

మొంథా తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి పశ్చిమ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి చేలల్లో నీళ్లు నిలిచాయి. డ్రెయిన్లు పొంగుతున్నాయి. ఈ డ్రెయిన్లు మొరాయిస్తే సాగుకు ఇబ్బందులు తప్పవని వరి రైతుల్లో ఆందోళన మొదలైంది. మరోవైపు దేవుడా ఈ తుఫాన్ గండం దాటించాలని ఆక్వా రైతులు మొక్కుతున్నారు. ఇప్పటికే పొలాలు ముంపునకు గురైతే తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సూచనలు చేస్తున్నారు. ఏది ఏమైనా మొంథా తుఫాన్ ఎఫెక్ట్ వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో మరింత ఎక్కువగా కనిపిస్తుందని తెలుస్తుంది. ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని పరిస్థితులపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

తుఫాన్ ఎఫెక్ట్..


ద్వారకాతిరుమలలో దాదాపు ఖాళీగా వున్న దర్శనం క్యూలైను

వెంకన్నకు తగ్గిన భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయానికి వచ్చే భక్తుల రద్దీపై మొంథా తుఫాన్ తన ప్రభావాన్ని చూపింది. నిత్యం భక్తజనులతో కళకళలాడే ఆలయం తుఫాన్ ప్రచారం కారణంగా అరకొరగా వచ్చారు. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తుల లేమితో ఖాళీగా కన్పించాయి. ఈ రెండురోజులూ భక్తులు తక్కువగానే వస్తారని అధికారులు భావిస్తున్నారు.


ఆకివీడులో పోలీస్ స్టేషన్ బిల్డింగ్‌పై కప్పిన బరకం

ఆకివీడు పోలీస్ స్టేషన్‌పై కప్పిన బరకం

ఆకివీడు : ఆకివీడు పోలీస్ స్టేషన్ శిథిలావస్థకు చేరింది. తరచూ పెచ్చులూడుతుండడంతో అధికారులు, సిబ్బంది, జనం భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నానిపోవడంతో ముందస్తు చర్యగా పోలీస్ స్టేషన్‌పై బరకం కప్పారు. సంబంధిత ఉన్నతధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


తుఫాన్ ప్రభావంతో హడావుడిగా పత్తిని ఇంటికి చేరుస్తున్న రైతాంగం

పత్తి రైతుల్లో భయాందోళన

- హడావుడిగా సేకరించి ఇంటికి చేరుస్తున్న రైతులు

కుక్కునూరు : తుఫాన్ భయం పత్తి రైతాంగాన్ని వెంటాడుతోంది. ఈ ఏడాది ఇప్పటికే విస్తారంగా కురుసిన వర్షాలతో పత్తిపంటకు తీవ్ర నష్టం మిగిల్చింది. వర్షానికి పూత, పిందె రాలిపోయి అడుగు భాగంలో ఉన్న కాయలు రాలుతున్నాయి. ఈ క్రమంలో పత్తి రైతులు పత్తి చెట్లకు 20-30 కాయలు మాత్రమే కాపు ఉంది. ఇదే సమయంలో పత్తిచెట్టుకు ఉన్న కాయలు పగిలి పత్తిబయటకు వస్తుంది. వర్షం కురిస్తే పత్తి నేలరాలిపోతుందన్న భయం రైతాంగంలో ఉంది. గత రెండురోజులుగా పంటలో పత్తిని సేకరిస్తున్నారు. అనంతరం ఆ పత్తిని బస్తాల్లో వేసుకుని ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల సాయంతో ఇంటికి చేరుస్తూ హడావుడిగా పనులు చేస్తున్నారు.

కేంద్ర సాయానికి ప్రయత్నిస్తా

- తుఫాన్ ప్రభావంపై కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరంటౌన్,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌కు సంబంధిత సాయాన్ని జిల్లాకు కేంద్రం నుంచి సాయం అందించేలా ప్రయత్నాలు చేస్తానని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ హామీ ఇచ్చారు. ఢిల్లీ నుంచి ఆయన ప్రస్తుత తుఫాన్ పరిస్థితిపై సోమవారం ఆరా తీశారు. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి, ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేశ్‌తో చర్చించారు. జిల్లాలో తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాగం తీసుకున్న చర్యలను కలెక్టర్, ప్రత్యేకాధికారి ఆయనకు వివరించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్

ఏలూరుటూటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల ప్రజలకు ముంపు పొంచిఉన్న నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవసరమైన సహాయ సౌకర్యాలు కల్పించాలని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. తుఫాన్ పరిస్థితిపై సమీక్షా, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాల నేపథ్యంలో ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొల్లేరు, ఉప్పుటేరు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్ శాఖల సమన్వయంతో అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు తుఫాన్‌పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారన్నారు. ఆపదలో ఉన్న ప్రజలు 94910 41419, 98855 19299 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తుఫాన్‌పై జాగ్రత్తలు ఇలా..

భీమవరంటౌన్ : తుఫాన్ సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు విస్తృతంగా ప్రచారం చేశారు. ఎంతటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉంది. అధికారుల సూచనలను సత్వరమే పాటిస్తూ ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

- ప్రభుత్వ అధికారులు సూచించిన వెంటనే ఆయా ప్రాంతాల వారు సురక్షితప్రాంతాలకు తరలి వెళ్లాలి. పునరావాస కేంద్రాల్లో భోజన వసతి, విద్యుత్, వైద్య సౌకర్యాలు కల్పించారు.
- పురాతన భవనాలు, శిథిలావస్థలలో ఉన్న భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, వైర్ల వద్ద ఉండొద్దు.
- ముఖ్యంగా విలువైన పత్రాలు, వస్తువులను సురక్షితంగా ఉంచుకోవాలి.
- పశువులు, పెంపుడు జంతువులను కట్టకుండా వదిలి వేయాలి.
- ఉరుములు, పిడుగులు వంటివి పడే సమయంలో జాగ్రత్తగా ఉండాలి.
- విద్యుత్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి. విద్యుత్ ఉపకరణాల కనక్షన్ తీసి వేయాలి. కిటికీలు, తలుపులు మూసివేసి ఉంచడం మంచిది.
- తుఫాన్ సమయంలో సామాజిక మాధ్యమాల ద్వారా ఎన్నో వార్తలు వస్తాయి. అపోహలు కల్పిస్తారు. వాటిని ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దు.
- అత్యవసర సమయాల్లో కమ్యూనికేషన్ కోసం మొబైల్‌ను ఎప్పటికప్పుడు చార్జింగ్ చేసుకోవాలి.. లేకపోతే ఆపద సమయంలో ఇతరులకు సమాచార ఇచ్చే అవకాశం ఉండదు.
- ప్రభుత్వం, వాతావారణ శాఖ ఎప్పటికప్పుడు తుఫాన్ హెచ్చరికలను జారీ చేస్తోంది. సమాచారాలను అందిస్తోంది. ప్రజలు వాటిని నిరంతరం గమనిస్తూ ఉండాలి.
- తుఫాన్ సమయంలో అత్యవస వస్తువులు, సామగ్రిని సిద్ధం చేసుకోవాలి.
- వాగులు, వంకలు పొంగే అవకాశం ఉంటుంది. వాటిలో దిగే ప్రయత్నాలు చేయకూడదు.
- మొంథా తుఫాన్‌తో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. తీర ప్రాంతానికి వెళ్లి సముద్రంలో దిగే సాహసం చేయకూడదు. పేరుపాలెం బీచ్‌లో పోలీసులు గస్తీ కాస్తున్నారు.
- కార్తీక సాన్నాల కోసం గోదావరి, కాల్వల్లోకి సముద్రంలోకి దిగవద్దు.
- తుఫాన్‌లో ఆపద ఎదురైతే ప్రభుత్వం ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌కు సంప్రదించండి.

తుఫాన్ ఎఫెక్ట్‌తో ఉమ్మడి పశ్చిమ జిల్లాలో భారీ వర్షాలు.. తప్పని కష్టనష్టాలు

ఈసారి గట్టెక్కించు దేవుడా..

- ఎడతెరపిలేని వర్షాలకు చనిపోతున్న చేపలు, రొయ్యలు
- మొక్కుతున్న ఆక్వా రైతులు


ఆక్వా చెరువు

ఆకివీడురూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ఆక్వారైతులకు గండంగా మారింది. కొద్దిరోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండాలతో ఎడతెరపిలేకుండా కురుస్తున్న భారీవర్షాలకు ఆక్వారైతులు చిగురుటాకులా వణికిపోతున్నారు. భారీ వర్షాల వల్ల చెరువుల్లో నీటిమట్టం పెరిగిపోయింది. నీటిలోని శెలనిటీ తగ్గిపోవడంతో పాటు నీటిరంగు తగ్గిపోతుంది. దీనివల్ల రొయ్యలకు అందాల్సిన పోషకాలు, మినరల్స్ తగ్గిపోతాయి. ఎండలేకుండా వర్షాలు కురుస్తుంటే నీటిలోని ఉష్ణోగ్రత తగ్గిపోతుంది. ఈమేరకు నీటిలో పీహెచ్ తగ్గి, ఆక్సిజన్ శాతం తగ్గిపోవడంతో రొయ్యలు చనిపోయి కిందకు దిగిపోతాయి. చేపలు పైకి వచ్చి ఆక్సిజన్ అందక తిరుగుతూ చనిపోతాయి. వీటితో పాటు వైరస్ ప్రభావం పెరిగిపోతుంది. రొయ్యలకు సాధారణంగా ఎండ ఎక్కువగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటాయి. లేదంటే వైరస్, విబ్రియో వంటివి సోకి నష్టం వాటిల్లుతుంది. వాతావరణంలో వచ్చిన మార్పులు వల్ల రైతులు భయాందోళనలకు గురవుతున్నారు.

వణికిపోతున్న ఆక్వారైతులు..

ప్రభుత్వం, వాతావరణ శాఖల నేపథ్యంలో ప్రారంభమైన మొంథా తుఫాన్ పేరు చెబితేనే రైతులు వణికిపోతున్నారు. సోమవారం ఉదయం నుంచి ఎడతెరపిలేకుండా వర్షం కురుస్తుందనడంతో, చెరువులలో నీటి మట్టం అమాంతం పెరిగిపోతుందని, ఇప్పటికే నీటి పరిమాణం పెరిగిన రైతులు ఆందోళన చెందుతున్నారు. 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని చెబుతుండడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోవచ్చని, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడం వల్ల జనరేటర్ డీజిల్‌కు అదనపు ఖర్చు పెరిగిపోతుందని అంచనా వేస్తున్నారు. గాలి అంతవేగంగా వీస్తే చెరువుచుట్టూ కంచెలా ఏర్పాటు చేసిన ఆపాలు ఎగిరిపోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 40 వేల ఎకరాల్లో ప్రస్తుతం సాగు జరుగుతుందని, సాగు ప్రారంభమై ఇంచుమించుగా 20 రోజులు అవ్వవచ్చని, వీరందరికి ప్రమాదం పొంచి ఉందని వాపోతున్నారు. ఇప్పటికే ధరలు తగ్గిపోవడం, వ్యాధులు బారిన పడి నష్టాలు పాలవుతున్న రైతులకు వాతావరణం రూపంలో మరో పెద్ద సమస్య వచ్చిపడింది.

వర్షాలతో అతలాకుతలం



గత కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆక్వా అతలా కుతలం అవుతోంది. నీటిలో ఉష్ణోగ్రత తగ్గిపోయి, ఆహారం తీసుకోవు, వ్యాధులు బారిన పడతాయి. ఆక్సిజన్ పరిమాణం తగ్గి రొయ్యలు, చేపలు చనిపోతాయి. ప్రస్తుత వాతావరణం ఆక్వారైతులకు పెద్దశత్రువుగా మారిపోయింది. గండం దాటించు దేవుడా అని మొక్కడం తప్ప గత్యంతరం లేదు.

– డి.కన్నబాబు
ఆక్వారైతు, కొళ్లపర్రు

మొంథా అంటే భయమేస్తుంది



మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో భయమేస్తుంది. ఇప్పటికే అన్ని రకాలుగా నష్టపోతున్నాం. ఇప్పుడు ఈ తుఫాను వల్ల విద్యుత్, ఇతర ఇబ్బందులతో భయాందోళనలు కలుగుతున్నాయి. వరదలు వచ్చే ప్రమాదం ఉండడం మరింత భయమేస్తుంది. అప్పులు చేసి సాగులు చేస్తున్నాం, ప్రకృతి శాంతిస్తేనే ఆక్వామనుగడకు అవకాశం.

– కె.హనుమ
ఆక్వారైతు, గుమ్ములూరు

ఆక్వా రైతులకు జాగ్రత్తలు ఇలా..

ఉండి : భారీ వర్షాల వల్ల రొయ్యలు, చేపల చెరువుల్లో ఆక్వా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉండి కృషి విజ్ఞానకేంద్రం ఫిషరీస్ శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసరావు అన్నారు. వాతావరణం పరిస్థితుల నేపథ్యంలో ఆక్వారైతులకు శాస్త్రవేత్త సూచనలు అందించారు. ప్రస్తుతం తుఫాన్ ప్రభావంతో చేపలు రొయ్యల చెరువులలో ఆక్సిజన్ లోపం ఏర్పడడం, అమ్మోనీయం, హెచ్2ఎస్ వంటి విషవాయువులు ఉత్పత్తి అయి చేపలకు, రొయ్యలకు ఒత్తిడి కలిగి వ్యాధులకు గురికావడం, చనిపోవడం సంభవిస్తున్నాయి. ప్రధానంగా పెద్ద సైజు చేపలు శంఖుజలగ, బ్యాక్టీరియా వ్యాధి వున్న చేపలు ఎక్కువగా చనిపోతాయి. ముందుగానే చెరువునీటిని పరీక్షించుకుని నీటి ఆక్సిజన్ స్థాయి ఐదు పీపీఎం కంటే తక్కువగా వున్నట్టు గుర్తిస్తే వెంటనే ఏరియేటర్లు లేదా రీసర్క్యులేషన్ చెరువునీటిని చెరువులోకి తోడడం లేదా బోటు తిప్పడం రాత్రి పది గంటలు నుంచి ఉదయం ఎండ వచ్చే వరకు ఏర్పాటుచేసుకోవాలి. శంఖుజలగ వ్యాధులున్నట్లు గమనిస్తే పొటాషియం పెర్మాంగనేటు ఎకరానికి అరేకేజీ నుంచి ఒక కేజీ వరకు తెల్లవారుజామున చెరువునీటిలో చల్లుకోవాలి. సాయంత్రం పూట జియోలైటు ఎకరానికి పది కేజీలు, గేనోనెక్స్ ముక్క కలిగిన పౌడర్‌ను పావుకేజీ ఎకరానికి అమ్మోనియం తగ్గడానికి చల్లుకోవాలి. వర్షం పడితే అగ్రికల్చరల్ లైమ్ ఎకరానికి 30 కేజీలు చల్లుకోవాలి. మేతలు గమనించి తక్కువగా ఇవ్వాలి. వారానికి ఒకరోజు మేత ఇవ్వడం మానివేసిన మంచిది. ఏవిధమైన రసాయనాలు, ఎరువులు వాడవద్దంటూ సూచించారు.


ఉండి రొయ్యలను పరీశీలిస్తున్న కేవీకే ఫిషరీస్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరావు

పలు రైళ్లు, విమాన సర్వీసులు రద్దు

ఏలూరుక్రైం/భీమవరం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో పశ్చిమ గోదావరి జిల్లా మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేశారు. సోమవారం విశాఖ-ఎల్‌టీటీ (18519), మంగళవారం ఎల్‌టీటీ-విశాఖ(18520) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ చక్రవర్తి తెలిపారు. అలాగే 28వ తేదీ మంగళవారం విజయవాడ-భీమవరం(67281), భీమవరం-విజయవాడ(67282), భీమవరం-నిడదవోలు(67283), నిడదవోలు-భీమవరం(67284), నరసాపురం-నిడదవోలు(67244), నిడదవోలు-నరసాపురం(67245), నరసాపురం-రాజమండ్రి (67246), నరసాపురం-విజయవాడ (67276), భీమవరం-నిడదవోలు (67277), నిడదవోలు-భీమవరం(67278), నరసాపురం-గుంటూరు(67247), విజయవాడ-నరసాపురం (67257), రాజమండ్రి-భీమవరం(67241), 29వ తేదీ బుధవారం భీమవరం-నిడదవోలు(67242), నిడదవోలు-నరసాపురం(67243), నరసాపురం-నిడదవోలు(67244), నిడదవోలు-నరసాపురం(67245), భీమవరం-నరసాపురం(17263) రైళ్లను రద్దు చేశారు.

ఏలూరు జిల్లా మీదుగా..

తుఫాన్ నేపథ్యంలో ఏలూరు జిల్లా మీదుగా వెళ్లే కొన్ని రైళ్లను ఈనెల 28న కొన్ని రైళ్లను, ఈనెల 29న మరికొన్ని రైళ్లను రద్దు చేశారు. విజయవాడ - రాజమండ్రి(67262), విజయవాడ-కాకినాడ పోర్టు (17257), విజయవాడ-రాజమండ్రి(67202) రాజమండ్రి - విజయవాడ (67201), రాజమండ్రి - విజయవాడ (67261), కాకినాడ పోర్టు-విజయవాడ (17258), తిరుపతి-విశాఖపట్టణం (08584), విశాఖ పట్టణం-గుంటూరు(22875), గుంటూరు-విశాఖ పట్టణం(22876), తిరుపతి- విశాఖ పట్టణం(22708), హైదరాబాద్- విశాఖ పట్టణం(12728), మహబూబ్ నగర్-విశాఖపట్టణం(12862), చెన్నై సెంట్రల్- విశాఖ పట్టణం(22870), సికింద్రాబాద్- విశాఖ పట్టణం(12740), భువనేశ్వర్- బెంగళూరు(18463), భువనేశ్వర్-సికింద్రాబాద్ (17015), భువనేశ్వర్-పాండిశ్చేరి (20851), సికింద్రాబాద్-భువనేశ్వర్(18464) రైళ్లను రద్దు చేశారు.



విమాన సర్వీసులు..

రాజమహేంద్రవరం, : తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం (మధురపూడి) ఎయిర్ పోర్టు నుంచి విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. మొంథా తుఫాన్ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు అధికారులు అప్రమత్తం అయ్యారు. మంగళవారం ఉదయం 9-30గంటల లోపు నడిచే ఢిల్లీకి 1, హైదరాబాద్‌కు 2 సర్వీసులు మాత్రమే యథావిధిగా నడుస్తాయి. తరువాత సర్వీసులన్నీ రద్దు అయినట్టు ఎయిర్‌పోర్టు ఇన్‌చార్జి అధికారి వీరవల్లి శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ముంబై, తిరుపతి, బెంగుళూరు, చెన్నై సర్వీసులు అన్నీ రద్దు అయి నట్లే. ఇక ఎయిర్‌పోర్టు రన్‌వే పరిసర ప్రాంతాల్లో నీరు చేరకుండా చెట్లకొమ్మలు అడ్డురాకుండా హెలికాప్టర్లు అత్యవర సమయంలో లాండ్ అయ్యేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు.

మొంథాకు ముందే మునిగిన మినుము రైతు



వర్షాలకు దెబ్బతిన్న మినుము తోటను చూపుతున్న సీపీఎం నాయకులు
మొలకెత్తిన మినుము పంట

- నూజివీడు డివిజన్‌లో 90 శాతం పంట నష్టం
- 15 వేల ఎకరాల్లో మినుము సాగు
- ప్రభుత్వ ఆదుకోవాలని రైతుల వినతి

నూజివీడు టౌన్ : మొంథా తుఫాన్‌కు ముందే మినుము రైతు నిండా మునిగాడు. వారంరోజులుగా నూజివీడు డివిజన్ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు కోతవచ్చిన మినుము మొలకెత్తి తీవ్రనష్టం చేకూరింది. వాణిజ్య పంటలకు సైతం తీవ్రనష్టం వాటిల్లింది. నూజివీడు నియోజకవర్గ పరిధిలో నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాలు దాదాపుగా మెట్టప్రాంతాలుగా ఉన్నాయి. ప్రతి సీజన్‌లో ఈ మండలాల్లో సీడ్‌పత్తి సాగవుతూ ఉంటుంది. ప్రస్తుత సీజన్‌లో సీడ్ పత్తిని ఆర్గనైజర్లు ఇవ్వకపోవడంతో రైతులు మొక్కజొన్న వైపు మొగ్గు చూపారు. మొక్కజొన్న సీజన్ నవంబరు నుంచి ప్రారంభం అవుతుండడంతో తొలిపంటగా మినుము సాగు చేశారు. సరిగ్గా కోతకు వచ్చే సమయంలో భారీ వర్షాలు కురవడంతో నియోజకవర్గంలో 15 వేల ఎకరాల్లో సాగవుతున్న కోతకు వచ్చిన మినుముపంట తడిచి ముద్దవుతోంది. నూజివీడు డివిజన్లలో 90 శాతం పంట నష్టం వాటిల్లినట్టు పేర్కొన్నారు. తడిచిన కాయి బూజురావడంతో పాటు అనేక ప్రాంతాల్లో కాయల్లోనే గింజలు మొలకెత్తడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రామన్నగూడెంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న మినుము పంటను రైతు సంఘం నాయకులు, సీపీఎం నాయకులు సోమవారం పరిశీలించారు.

ఎకరానికి 40 వేలు ఖర్చు..

కౌలు, దుక్కి, విత్తనం, పురుగు మందులు, ఇతరత్రా కలిపి ఎకరానికి రూ.30వేల నుంచి రూ.40 వేలవరకు మినుము సాగుకు పెట్టుబడి అయంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రైతుకు ఒక్కరూపాయి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మొంథా ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో ఇప్పటికే నష్టపోయిన మినుమును తీత తీయకుండానే దుక్కిదున్నేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన మినుముపంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టనివారణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మినుము రైతులను ఆదుకోవాలి



నూజివీడు నియోజకవర్గం ప్రధానంగా మెట్టప్రాంతం పొగాకు, పత్తితో పాటు మినుము అత్యధికంగా సాగు చేస్తున్నాం. ప్రస్తుతం కురిసిన భారీవర్షాలకు మినుము రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో తడిచిన మినుములను ప్రభుత్వం కొనుగోలు చేయడంతో పాటు తీవ్రంగా నష్టపోయిన రైతులకు పంట రుణమాఫీ చేసి నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– చలసాని వెంకటరామారావు
రైతు నాయకుడు

గురువా.. ఎందుకీ ఆలస్యం?!

- ఏలూరు జిల్లాలో ఆలస్యంగా హాజరైన టీచర్లు 2018 మంది!
- ఉదయం 9 గంటలకే అటెండెన్స్ : డీఈవో ఆదేశం

ఏలూరు అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):జిల్లాలో పలువురు టీచర్లు కచ్చితమైన సమయానికి పాఠశాల విధులకు హాజరుకావడం లేదు. ఉదయం 9 గంటలకే తరగతులు ప్రారంభమవుతుండగా, కొందరు ఉపాధ్యాయులు పది నిమిషాలు, అంతకంటే ఆలస్యంగా హాజరును నమోదు చేస్తున్నట్టు అధికారికంగా గుర్తించారు. ప్రస్తుత విద్యాసంవత్సరం పాఠశాల పనిదినాల్లో ఇంతవరకు మొత్తం 2018 మంది టీచర్లు ఉదయం 9.10 గంటల తర్వాతే హాజరును నమోదు చేసిన విషయాన్ని జిల్లావిద్యాశాఖ సోమవారం వెల్లడించింది. ఆ మేరకు డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆలస్యపు హాజరు నమోదు టీచర్ల వివరాలను డీవైఈవోలు, ఎంఈవోలకు పంపించారు. ఇలా ఆలస్యంగా హాజరును వేస్తున్నవారిలో గరిష్టంగా 65 రోజులు, అంతకుపైబడి రోజుల్లో లేటుగా అటెండెన్సును నమోదు చేస్తుండడం గమనార్హం.

ఏలూరు జిల్లాలోని మొత్తం 27 మండలాల్లో అత్యధికంగా జిల్లా కేంద్రంలోనే 232 మంది ఉపాధ్యాయులు కచ్చితమైన సమయంలో హాజరును నమోదుచేయడం లేదని గుర్తించారు. ఆ తదుపరి బుట్టాయగూడెం మండలంలో 216 మంది, నూజివీడు మండలం-188 మంది, చింతలపూడి మండలం-106 మంది, జంగారెడ్డిగూడెం మండలం-101మంది టీచర్లు సకాలంలో హాజరు నమోదుచేయడం లేదు. తరచూ నెట్‌వర్క్ సమస్యలు, మారుమూల ప్రాంతాలలో ఉండే కుక్కునూరు మండలంలో 69 మంది, వేలేరుపాడు మండలంలో 67 మంది, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, టి.నరసాపురం, తదితర మండలాల్లో సకాలంలో హాజరు నమోదు చేయని టీచర్ల సంఖ్య రెండంకెలను మించకపోవడం విశేషం. ఈ నేపథ్యంలో జిల్లాలో హాజరును ఆలస్యంగా నమోదు చేస్తున్న టీచర్ల జాబితాలో ఉన్నవారంతా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతిరోజు ఉదయం 9 గంటలకు అటెండెన్స్‌ను నమోదుచేయాలని, ఆలస్యాన్ని సరిచేసుకునేందుకు ఒక అవకాశాన్నిస్తున్నట్టు హెచ్చరించారు. పాఠశాల విధులకు ముందుగానే హాజరవుతున్నా నెట్‌వర్క్ సమస్యలవల్లే హాజరునమోదులో జాప్యం జరగడానికి కారణమవుతోందని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి.



భీమవరంలో మాట్లాడుతున్న పాకా వెంకట సత్యనారాయణ, నాయకులు

త్వరలో కేన్సర్ సర్వే బృందం రాక : పాకా

భీమవరంటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):'రాష్ట్రంలోనే అత్యధికంగా కేన్సర్ రోగులు పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్నట్టు తాజా సమాచారం. ఈ మేరకు జిల్లాలో కేన్సర్ వ్యాధిగ్రస్తుల వివరాలను సేకరించేందుకు సర్వే బృందం త్వరలో జిల్లాకు రానుంది' అని రాజ్యసభ సభ్యులు, సైన్స్ అండ్ టెక్నాలజీ పర్యావరణ విభాగం పార్లమెంటరీ కమిటీ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ తెలిపారు. సోమవారం భీమవరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు అమల్లో ఉన్న కేన్సర్ కణాల నివారణ ప్రక్రియపై కొత్తగా వచ్చిన టెక్నాలజీని కేంద్ర పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తరఫున ఇటీవల బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్‌ను సందర్శించానన్నారు. ఆ సెంటర్లో కేన్సర్ నివారణకు కొత్త టెక్నాజీని అమలు చేసి విజయవంతమైన ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ఈ టెక్నాలజీ ద్వారా మన జిల్లాలో కేన్సర్ రోగులపై సర్వే చేసి వారి ఆ ప్రమాదం నుంచి విముక్తి చేసే ప్రక్రియ అమలు చేస్తామన్నారు.బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కలిదిండి వినోద్ వర్మ, కోమటి రవికుమార్, అడబాల శివ, వబిలిశెట్టి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


పతకాలు సాధించిన సీఆర్ఆర్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు

చెస్ పోటీల్లో సీఆర్ఆర్ విద్యార్థులకు పతకాలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):ఏపీ రాష్ట్ర ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో ఏలూరు సీఆర్ఆర్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు పలువురు బహుమతులు గెలుచుకోగా, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఒక విద్యార్థి జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. జంగారెడ్డిగూడెంలో ఈనెల 26న జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో స్కూలు విద్యార్థులు 11 స్వర్ణ పతకాలు, ఒక ద్వితీయ బహుమతి, 3 షీల్డ్‌లు అందుకున్నారని విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్, కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్, ప్రిన్సిపాల్ సాయికుమారి తెలిపారు. అద్వైహ్, గణేశ్, అగస్త్య, రుత్విక్, దీపక్, జౌషిక్, చరణ్, దిశాంత్, జీవన్, మనోజ్, సాయిసాత్విక్, యశ్వంత్, జేష్నా, తనిష్‌రెడ్డి గోల్డ్‌మెడల్స్ సాధించగా, పదోతరగతి విద్యార్థి నవదీప్ టోర్నమెంట్ ద్వితీయ బహుమతి గెలుచుకుని జాతీయస్థాయి టోర్నీకి ఎంపికయ్యాడని వివరించారు. విజేతలను, పీఈటీ సోమరాజును అభినందించారు.

కరాటే పోటీల్లో..

సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించిన ఆలిండియా కరాటే చాంపియన్‌షిప్(బడేటి కప్) కటా విభాగం పోటీల్లో పబ్లిక్ స్కూలు విద్యార్థులు జీయర్వి, సిద్ధార్థ, సాయిసాత్విక్, హర్షిణి, రాహుల్ దత్త, గౌతమ్‌లకు స్వర్ణపతకాలు, నాగహేమచంద్ర, నాగభార్గవ్, శరణ్య, దుర్గేశ్, జ్ఞానశ్రీ దీపక్, శర్మ, ఆదిత్య నాగవర్ధన్, లవలిఖలకు రజిత పతకాలు లభించాయని తెలిపారు. కుమితే విభాగం పోటీలో గౌతమ్, రాహుల్‌శ్రీదత్త, జీయర్వి, సాయిసాత్విక్, శరణ్యలకు పతకాలు లభించాయన్నారు.

సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడల ఎంపిక పోటీలు వాయిదా

ఏలూరు రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 29న ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో జరగాల్సిన ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగులకు, పురుషులు, మహిళలకు పలు క్రీడాంశాల్లో జిల్లాస్థాయి ఎంపికలు తుఫాన్ కారణంగా ఎంపిక పోటీలు వాయిదా వేశామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక పోటీలు ఎప్పుడు జరిగేది అనే విషయంపై తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

జర్మనీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలు

ఏలూరుటూటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జర్మనీ దేశంలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాల కోసం అర్హులైన మైనార్టీ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తెలిపారు. ఐటీఐ, మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమోలో ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 30ఏళ్ల లోపు వయస్సు ఉండి రెండేళ్ల అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.2 లక్షల 60 వేలు జీతం ఉంటుందన్నారు. నవంబరు రెండో తేదీలోగా ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 99888 53335, 87901 17279/8349 నంబర్లలో సంప్రదించాలన్నారు.


ప్రత్యేక అలంకరణలో గునుపూడి సోమేశ్వరస్వామి




పాలకొల్లు క్షీరారామంలో స్వామివారికి పూజలు.. ఆచంటలో ఆచంటేశ్వరుడికి, ఏలూరు పత్తేబాద చౌదేశ్వర రామలింగేశ్వర స్వామికి అభిషేకాలు

హరహర మహాదేవ..

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- ఘనంగా కార్తీక సోమవారం పూజలు


ద్వారకాతిరుమలలో శివయ్యకు పూజలు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా శివాలయాలు ఓం నమఃశివాయ అన్న శివనామ స్మరణతో మార్మోగాయి. పాలకొల్లులోని క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయం సమీపంలోని రేపాక వారి సత్రంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు 3000 మందికి భోజనాలు ఏర్పాటుచేశారు. తుఫాను కారణంగా భక్తుల సంఖ్య తగ్గినప్పటికీ తెలంగాణా, ఒడిశా, కర్నాటక నుంచి పలువురు భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నారు. సుమారు 18 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్టు ఆలయ వర్గాల సమాచారం.

భీమవరం టౌన్: భీమవరంలోని పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వరస్వామిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు క్యూ కట్టారు. 20 వేల మంది భక్తులు దర్శించుకున్నట్టు అంచనా. తుఫాన్ కారణంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారి సంఖ్య తక్కువగానే కనిపించింది. భక్తులకు వెంపకు చెందిన గొట్టుముక్కల భీమరాజు సౌజన్యంతో అన్న ప్రసాదాన్ని దేవ స్థానం ఆధ్వ ర్యంలో పంపిణీ చేశారు.

ఆచంట: కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు వేకువజామునే కాలువల్లోనూ, చెరువుల్లోనూ, కార్తీక దీపాలు వెలిగించి అనంతరం శివాలయాలను దర్శించుకున్నారు. ప్రసిద్ధ ఆచంటేశ్వరుని ఆలయంలో వేకువజాము నుంచే భక్తుల స్వామి వారిని దర్శించుకుని అభిషేకాలు చేశారు.

ద్వారకా తిరుమల: క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయాన్ని, పరిసరాలను పూలమాలలతో విశేషంగా అలంకరించారు. గర్భాలయంలో కొలువైన శివయ్యకు అర్చకులు అభిషేకాలు జరిపారు. పలువురు మహిళా భక్తులు ఆలయ ఆవరణలోని ఉసిరిచెట్ల వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. శివ దీక్ష చేపట్టిన శివ స్వాములు, భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది.

కామవరపుకోట: మండలంలోని గుంటుపల్లి పంచాయతీ జీలకర్రగూడెం కొండగట్టుపై గల బౌద్ధారామాల వద్ద కార్తీక సోమవారం నేపథ్యంలో సందడి నెలకొంది. జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు విచ్చేసి ఇక్కడ గల బౌద్ధారామాలను, చైత్యాలను, బౌద్ధ స్తూపాలను తిలకించారు. కొండపై గల ధర్మలింగేశ్వరస్వామికి మహిళలు సంతాన ప్రాప్తికోసం తడి దుస్తులతో ప్రణామ దీక్షలు చేపట్టారు.


ద్వారకాతిరుమలలో శివయ్యకు పూజలను కనులారా వీక్షిస్తున్న భక్తులు



స్వయంగా పూజలందుకున్న నాగమ్మ!

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలో ఓ అద్భుతం జరిగింది. ఓ భక్తుడు తన కుటుంబంతో స్థానిక బాట గంగానమ్మగుడి సమీపంలోని వేపచెట్టు కింద ఉన్న పుట్టలో పాలు పోసి పూజలు చేస్తుండగా పుట్టలోంచి పాము బయటకు వచ్చింది. అక్కడ పూజలు చేసిన భక్తుడు స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతి. ఆయనతో పాటు ఇతర భక్తులు కూడా పూజలు చేసేంత వరకు ఆ పాము ఎటూ వెళ్లకుండా అక్కడే వారి పూజలందుకుంది. కార్తీక మాసంలో ఇలా నాగేంద్రస్వామి భక్తుల పూజలందుకోవడానికి స్వయంగా వచ్చాడని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

తమ గ్రామంలోనే పంచాయతీ కార్యాలయం నిర్మించాలని ధర్నా

కొయ్యలగూడెం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోనే పంచాయతీ కార్యాలయం నిర్మించాలంటూ కనకాద్రిపురం గ్రామస్థులు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఇటీవల పంచాయతీ భవనం మంజూరైందని అయితే భవనం కుంతలగూడెంలో నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారని భవనాన్ని కనకాద్రిపురంలో నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పంచాయతీ కనకాద్రిపురంలోనే కొనసాగుతున్నందున ఇక్కడే భవనాన్ని నిర్మించాలని కనకాద్రిపురం గ్రామస్థులు కోరుతున్నారు. ఈ భవన నిర్మాణ విషయం కొంత కాలంగా కుంతలగూడెం, కనకాద్రిపురం గ్రామాల మధ్య సమస్యగా నెలకొంది. తమ గ్రామం పేరునే పంచాయతీ ఉన్నందున తమ గ్రామంలోనే పంచాయతీ కార్యాలయం నిర్మించాలని కుంతలగూడెం గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ ఏర్పాటు అయినప్పటి నుంచి కనకాద్రిపురంలో పంచాయతీ కార్యకలాపాలు కొనసాగుతున్నందున తమ గ్రామంలోనే భవనం నిర్మించాలని కనకాద్రిపురం గ్రామస్థులు కోరుతున్నారు. మంగళవారం కుంతలగూడెంలో శంకుస్థాపన చేస్తున్నారన్న ప్రచారంతో కనకాద్రిపురం గ్రామస్థులు నిరసనకు దిగారు.



విద్యుత్ స్తంభానికి మంటలు

భీమవరం క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భీమవరం మావుళ్ళమ్మ గుడి సమీపంలోని పూరి గుడి వద్ద సోమవారం మధ్యాహ్నం విద్యుత్ స్తంభానికి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో అందరూ కంగారుపడ్డారు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఎగసిపడ్డాయి. దానికి తోడు ఆ స్తంభానికి కేబుల్ వైర్లు, నెట్ వైర్లు అధికంగా ఉండటంతో మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. అక్కడున్నవారు హుటాహుటిన విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ నిలిపివేశారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వెళ్ళి మంటలను అదుపు చేశారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

లాడ్జిలో ఒకరి అనుమానాస్పద మృతి

నూజివీడు టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన నూజివీడు వెంకటేశ్వర లాడ్జీలో చోటు చేసుకుంది. విజయవాడ యనమలకుదురుకు చెందిన కపిలవాయి వెంకటరామరాజు(36) ఆదివారం రాత్రి నూజివీడు వెంకటేశ్వర లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు.సోమవారం ఉదయం లాడ్జి సిబ్బంది రూమ్ శుభ్రం చేసేందుకు వెళ్లగా వెంకట రామరాజు తన రూమ్‌లో అచేతనంగా పడిఉన్నాడు. లాడ్జి సిబ్బంది సమాచారాన్ని నూజివీడు పట్టణ పోలీసులకు అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని స్వాధీనపరుచుకుని ఆధారాలు సేకరిస్తున్నారు. కాగా అతని వద్ద ఖాళీ అయిన మందు బిళ్లల కవర్లు ఉండటంతో వైద్యం చేయించుకునేందుకు వచ్చి మృతి చెందాడా? లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అనే అంశంపై విచారణ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతదేహాన్ని నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళాలు బద్దలు కొట్టి ఇంట్లో బంగారం చోరీ


చెల్లా చెదురుగా పడి ఉన్న వస్త్రాలు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణం శివాలయం వీధిలో ఇంటి తాళాలు బద్దలు కొట్టి బంగారు, వెండి వస్తువులు ఎత్తుకెళ్లిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది.తాడేపల్లిగూడెం శివాలయం వీధిలో శాసనాల వేణు గోపాలమ్మ తన మనుమడు అమెరికా నుంచి వచ్చాడని పది రోజుల క్రితం ఆకివీడు కుమార్తె ఇంటికి వెళ్లారు. అయితే సోమవారం ఇంటికి తిరిగి వచ్చే సరికే ఇంటి తలుపులు బద్దలుకొట్టి బీరువాలోని వెండిగిన్నెలు, రెండున్నర కాసుల బంగారు గొలుసు, చెవిదిద్దులు చోరీ చేసినట్టు గుర్తించారు. ఈ మేరకు వేణుగోపాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ. బాదం శ్రీనివాస్ తెలిపారు. రెండేళ్ల క్రితం వేణుగోపాలమ్మ మెడలోని బంగారు గొలుసు గుర్తు తెలియని వ్యక్తి లాక్కుని పోయాడు. ఆ కేసు కూడా ఇప్పటికీ కొలిక్కి రాలేదని బాధితురాలు వాపోతున్నారు.

అనధికార మద్యం దుకాణాలపై దాడులు

ఏలూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కైకలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న దుకాణాలపై కేసులు నమోదు చేసి, ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి 25 లిక్కర్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్టు ఏలూరు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. చింతలపూడి, జంగారెడ్డిగూడెం స్టేషన్ల పరిధిలో విస్తృతంగా దాడులు చేపట్టామని, ఎక్కడా అక్రమ మద్యం విక్రయాలు జరగలేదన్నారు. ఈ నెలలో గడిచిన 12 రోజుల్లో 711 కేసుల అనధికార మద్యం దుకాణాలపై దాడి చేసి 715 మందిని అరెస్టు చేశామన్నారు. 1584 లీటర్ల ఐఎంఎల్ లిక్కు, 94 లీటర్లు బీరు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కొనుగోలు చేసిన లారీ ఈఎంఐ బకాయిలు చెల్లించలేక పురుగు మందు తాగిన వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ఏలూరు వెంకటాపురం పంచాయతీ శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన పిల్లా పెంటయ్య(45) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 2024లో ఫైనాన్స్‌లో ఒక లారీ కొనుగోలు చేశాడు. సరైన కిరాయిలు లేక ఏలూరు చిరంజీవి బస్టాండ్ ప్రాంతానికి చెందిన పెంటకోటు నాగార్జునకు లారీని విక్రయించాడు. నాగార్జున ఆ లారీని ఇతర రాష్ట్రంలో ఉంచి కిరాయిలు తిప్పుతున్నాడు. ఈఎంఐలు చెల్లించడం లేదు. ఈ నేపథ్యంలో నాగార్జున వేధింపులు భరించలేక ఈనెల 25వ తేదీ రాత్రి ఏలూరు కోటదిబ్బ దర్గా వద్ద పెంటయ్య పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న పెద్ద కుమారుడు వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

సోషల్ మీడియాలో కల్పిత పోస్టులు పెడుతున్న వ్యక్తి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జయసూర్య

భీమవరం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో కూటమి ప్రభుత్వం మధ్య విభేదాలు సృష్టించడమే పనిగా పెట్టుకున్న ఒకరిపై కాళ్ల పోలీస్ స్టేషన్‌లో టీడీపీ ప్రధాన కార్యదర్శి మంతెన కోదండ రామరాజు ఫిర్యాదు చేయగా ఈ నెల 26న అరెస్టు చేశారు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసినట్టు భీమవరం డీఎస్పీ ఆర్.జి.జయసూర్య తన కార్యాలయంలో సోమవారం వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం మల్కాపురం గ్రామానికి చెందిన అంబోజీ వినయ్‌కుమార్ ఈ నెల 25న టీడీపీ-జనసేన పార్టీలకు సంబంధించి ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజుపై నకిలీ కల్పిత పోస్టులు పెట్టాడు. దీనిపై ఫిర్యాదు అందడంతో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు భీమవరం డీఎస్పీ జయసూర్య, టూటౌన్ సీఐ కాళీచరణ్, కాళ్ల ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావులు ఈ నెల 26న హైదరాబాద్ వెళ్లారు. అక్కడ పాండురంగ నగర్‌లో ఉన్న అంబోజీ వినయ్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. యువకుడిపై గతంలోనూ జగ్గయ్యపేటలో రెండు కేసులు ఉన్నట్టు డీఎస్పీ తెలిపారు.

మోటార్ సైకిళ్ల దొంగల ముఠా అరెస్టు


పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

ముదినేపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):పలు ప్రాంతాల్లో మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న ఓ ముఠాను ముదినేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ ముఠా నుంచి లక్షలాది రూపాయల విలువైన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ సోమవారం ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముదినేపల్లి మండలం దేవపూడి రోడ్డులో ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు తన సిబ్బందితో సోమవారం ఉదయం వాహనాల తనిఖీ చేస్తుండగా, ముగ్గురు యువకులు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా అనుమానంతో వెంటాడి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ముదినేపల్లి మండలం ప్రొద్దువాక గ్రామానికి చెందిన యెండూరి జీవన రాజు, విజయవాడ అజిత్ సింగ్ నగర్‌కు చెందిన జలసూత్రం సాయి సురేశ్, మరో బాలుడు బైక్ చోరీలకు పాల్పడుతున్నట్టు తెలిసిందన్నారు. ఇటీవల కాలంలో ఈ ముగ్గురు రూ.11.05 లక్షల విలువైన బైక్‌లను విజయవాడ, తాడేపల్లి, కైకలూరు, ముదినేపల్లి ప్రాంతాల్లో చోరీ చేసి వాటిని ప్రొద్దువాక గ్రామంలో కుర్మా సుధాకర్ వద్ద దాచినట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి, బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు. ఎస్ఐ వీరభద్రరావు పాల్గొన్నారు. నిందితులను పట్టుకుని, సొత్తును స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ చూపిన కైకలూరు సీఐ రవికుమార్, ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావు, ముదినేపల్లి పోలీస్ స్టేషన్ కానిస్టేబుళ్ల బి.నాగరాజు, శివకోటయ్య, వై.నాగరాజు, పవన్ కుమార్‌లను ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ అభినందించారు.

దైవదర్శనానికి వెళ్తే ఇంట్లో దొంగలు పడ్డారు

ఏలూరు క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులతో దైవదర్శనానికి వెళ్ళి వచ్చే సరికే దొంగలు ఆ ఇంటి తాళాల పగులగొట్టి, ఇంట్లోని బీరువాను, కబోర్డులను కూడా పగులగొట్టి బంగారపు వస్తువులు, వెండి వస్తువులను అపహరించుకుపోయారు.ఏలూరు రూరల్ మండలం చొదిమెళ్ల గ్రామంలో నివాసం ఉంటున్న వెంకట అనంతరామం మొక్కజొన్న సీడ్స్ డీలర్‌గా వ్యాపారం చేస్తున్నారు. ఆయన కుటుంబ సభ్యులతో సహా ఈనెల 26న రావులపాలెం వెళ్లి రాత్రికి ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఇంటి తలుపులు బద్దలు కొట్టి ఉన్నాయి. ఇంట్లోనిఇ బంగారపు, వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయి. సుమారు నాలుగున్నర లక్షల విలువైన వస్తువులు అపహరణకు గురైనట్లుగా ప్రాథమికంగా గుర్తించారు. ఈసంఘటనపై ఏలూరు రూరల్ ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఊరు వెళ్తే ఇల్లు దోచేశారు..

ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో ఫంక్షన్‌కు వెళ్తే దొంగలు ఆ ఇంటి తాళాలు పగులగొట్టి విలువైన బంగారం, వెండి వస్తువులను అపహరించుకుపోయారు. ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 5వ రోడ్డులో నివాసం ఉంటున్న తూతి చంద్రశేఖర్ తన కుటుంబ సభ్యుతో హైదరాబాద్ వెళ్ళారు. వారు ప్రస్తుతం హైదరాబాద్‌లోనే ఉన్నారు. సోమవారం ఉదయం ఆ ఇంటి తాళలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో బీరువాలు కూడా పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని వస్తువులు కూడా చెల్లాచెదరుగా పడవేసి ఉన్నాయి. వెండి, బంగారపు వస్తువులు, కొంత నగదు అపహరణకు గురైనట్లు భావిస్తున్నారు. సమాచారం పోలీసులకు తెలియజేయడంతో పోలీసులు, క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలిస్తున్నారు. మరోవైపు తూతిక చంద్రశేఖర్ హైదరాబాద్ నుంచి బయల్దేరారు.

మోటార్ సైకిల్ ఢీకొని ఒకరి మృతి


ఇజ్రాయేల్(ఫైల్)

ఏలూరు క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిని మోటార్ సైకి ఢీకొట్టడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ముసునూరు మండలం వేల్పు చర్ల గ్రామానికి చెందిన కందుల ఇజ్రాయేల్ (35)కు భార్య బాల, పిల్లలు ఉన్నారు. ఉప్పు, ముగ్గు అమ్ముతూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. కొద్ది నెలల క్రితం హనుమాన్ జంక్షన్‌కు కుటుంబంతో సహా వెళ్లి అక్కడ నివా సం ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం ఏలూరు మెయిన్ బైపాస్ రామచంద్ర ఇంజ నీరింగ్ కాలేజీ వద్ద రోడ్డుపై నడిచి వెళ్తున్న అతడిని ఆశ్రం నుంచి విజయవాడ వైపు వెళ్లే మోటారు సైకిలిస్టు బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన ఇజ్రా యేల్‌ను నేషనల్ హైవే అథార్టీ ఆఫ్ ఇండియా అంబులెన్సు సిబ్బంది ఏలూరు ప్ర భుత్వాసు పత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రి అత్యవసర విభాగపు వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ఒకరికి 14 రోజుల రిమాండు

భీమడోలు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): భీమడోలులో భార్య, భర్తల ఆత్మహత్యాత్నం కేసులో భార్య మిస్సింగ్ కేసులో నిందితుడైన కఠారి మోహన్‌కు పద్నాలు రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. వివాహేతర సంబంధం కేసులో భీమడోలు గ్రామానికి చెందిన గుండుమోలు సుధాకర్ ఇతడి భార్య భాను పూర్ణిమలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే..ఈ కేసుకు సంబంధించి ఈ నెల 7న భర్త సుధాకర్ భాను పూర్ణిమ కనిపించడం లేదని ఇందుకు కఠారి మోహన్ కారణమంటూ భీమడోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భానుపూర్ణిమ వాంగ్మూలం తీసుకున్న పోలీసులు నిందితుడు కఠారి మోహన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

14 కాసుల బంగారం చోరీ

భీమవరం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వివాహానికి వెళ్లి తిరిగి వచ్చి ఇంట్లో మంచంపై ఉంచిన బ్యాగును గుర్తు తెలియని దుండగులు దోచుకుపోయారు.దీనికి సంబంధించి టూటౌన్ ఎస్ఐ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం సూర్యనారాయణ పురానికి చెందిన కొమ్మన శ్రీనివాసరావు కుమార్తెకు ఇటీవల వివాహం చేశారు. వారు ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఈ నెల 26న భీమవరం తండ్రి నివాసానికి వచ్చారు. తన దగ్గర ఉన్న హ్యాండ్ బ్యాగును మంచంపై ఉంచి నిద్రపోయారు. ఉదయం లేచి చూసేసరికే బ్యాగు లేదు. అందులో 14 కాసుల బంగారు వస్తువులు, మూడున్నర కేరట్ల డైమండ్ కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కూటమి నాయకులకు అభినందన


జక్కం శ్రీమన్నారాయణ

నరసాపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అందరి కృషి, సహకారం వల్లే కూటమి ఆధ్వర్యంలో చేపట్టిన ఏఎంసీ ప్రమాణ స్వీకారోత్సవం విజయవంతమైందని ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈకార్యక్రమ విజయవంతానికి ఎంతో కృషి చేశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇదే జోరు కొనసాగించాలన్నారు.

వసుధా ఫౌండేషన్ ఆర్థిక సాయం

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):పక్షవాతంతో బాధపడుతున్న చింతపర్రు గ్రామానికి చెందిన రావి పెద్దింట్లు (62)కు రూ.10వేలు, అదే గ్రామంలో అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న బత్తున రామలక్ష్మి(60)కి రూ.10వేలు చొప్పున వసుధా ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామ రాజు చెక్కులను పంపించారని వాటిని సోమవారం ఇరువురికి అందించినట్టు ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్దరాజు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు కె ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


ఆకివీడులో నందీశ్వ రుడి వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు.. నరసాపుర ంలో గోదావరిలో కార్తీక దీపాలు వదిలిన భక్తులు



హరహర మహాదేవ

ఆలయాల్లో కార్తీక పూజలు

నరసాపురం/ఆకివీడు/పెనుగొండ/యలమంచిలి/గణపవరం/కాళ్ల/భీమవరం టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో భక్తులు నరసాపురంలోని గోదావరిలో పుణ్యస్నానాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పట్టణంలోని వలంధర్, అమరేశ్వర, మండలంలోని రాజులంక రేవుల్లో గోదావరిలో పుణ్యస్నానాలు చేసి రేవుల్లోని పరమశివుడ్ని దర్శించుకున్నారు. గట్టుపై కార్తీక నోములు నోచుకున్నారు. కార్తీక దీపాలను గోదావరిలో విడిచిపెట్టారు. ఆకివీడులోని మాదివాడ మల్లేశ్వరస్వామి, భీమేశ్వరస్వామి, సాలిపేట అగస్తేశ్వరస్వామి, వీరభద్రస్వామి, జవహర్‌పేట రాజరాజేశ్వరి మార్కండేశ్వరస్వామి, ధర్మాపురం శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.పెనుగొండలోని శ్రీ నగరేశ్వర మహిషాసుర మర్ధని ఆలయం, సిద్ధాంతంలో కేదారేశ్వర స్వామి, వడలిలో అగస్తేశ్వరస్వామి ఆలయాలు వేకువజామునే భక్తులతో కిటకిటలాడాయి. ఈవో రామపెద్దింట్లు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గణపవరం, యలమంచిలి, కాళ్ల, భీమవరం తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

గౌరీ దేవికి నదీజలాలతో అభిషేకాలు


అమ్మవారికి అభిషేకం కోసం నదీ జలాలు తీసుకు వస్తున్న మహిళలు

పెంటపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పెంటపాడు వెలమ యువజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న గౌరీ దేవి ఉత్సవాలలో భాగంగా సోమవారం మహిళలు కలశాలతో నదీ జలాలను తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. వర్షం కుస్తున్నా జైగౌరీదేవి మాతా అంటూ గ్రామంలోని పెద్ద శివాలయం నుంచి వెలంపేట వరకు కలశాలను నెత్తిన పెట్టుకుని వచ్చారు. అనంతరం తీసుకువచ్చిన జలాలను అమ్మవారికి అభిషేకాలు చేశారు. మంగళవారం ఆలయ ప్రాంగణం వద్ద సామూహిక కుంకుమ పూజలు జరుగుతాయని కమిటి సభ్యులు తెలిపారు.

రిజిస్ట్రార్ కార్యాలయానికి రహదారి

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



ఆకివీడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి దారేదీ అనే కథనానికి లేఖర్లు స్పందించారు. రహదారి సక్రమంగా లేకపవడంతో అధికారులు, సిబ్బంది, కక్షిదారులు, లేఖర్లు పడిపోతున్నా అధికారులు పట్టించుకోలేదు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి లేఖరు జిత్తూ తన సొంత డబ్బులతో తూర పెట్టించి సిమెంట్ చేయించారు. నగర పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలి

పోడూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోత): విజ్ఞాన భాండాగారాలుగా విరాజిల్లుతున్న శాఖాగ్రంథాలయాలను నూతన కమిటీలు అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని డీసీసీబీ మాజీ డైరెక్టర్, సొసైటీ ఛైర్మెన్ దేవళ్ల ప్రసాదు కోరారు. జిన్నూరులోని శ్రీసీతారామరాజు విజ్ఞాన లైబ్రరీ శాఖాగ్రంథాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడుగా పెన్మెత్స సూర్యనారాయణరాజు(సూరిబాబు), ఉపాధ్యక్షుడుగా బూడి కృష్ణ, కార్యదర్శిగా తాళాబత్తుల వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా ఆచంట సాయిరామ్‌లతో పాటు మరో ఏడుగురు కార్యవర్గ సభ్యులుగా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి, పాలకొల్లు ఏఎంసీ వైస్ చైర్మన్ దాసరి రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఎంప్లాయిూస్ కార్యవర్గం



పాలకొల్లు అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీ ఎంప్లాయిూస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం రాత్రి పెన్షనర్ల భవనంలో జరిగింది. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు జి.వీరబ్రహ్మం పర్యవేక్షణలో కె.కృష్ణారావు, అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడుగా వీరవల్లి రమేష్, ఉపాధ్యక్షుడుగా కె.శ్రీనివాస రావు (తణుకు), ఏ షణ్ముఖం (పాలకొల్లు) ప్రధాన కార్యదర్శిగా వారధి వెంకట రమణ (పాలకొల్లు) జాయింట్ సెక్రటరీగా సీహెచ్ మోహనరావు (పాలకొల్లు), కోశాధికారిగా పి.పాపారావు (కాళ్ళ)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హై అలర్ట్

(5వ పేజీ తరువాయి)

తీర ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఏడు నియోజకవర్గాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు, ప్రజలకు తక్షణ సాయం అందించేందుకు కలెక్టరేట్, డివిజన్ కార్యాలయాలు, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేసి 24 గంటలు పనిచేసే విధంగా చర్యలు చేపట్టారు. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు.

నేడు, రేపు భారీ వర్షాలు : జేసీ

తుఫాన్ నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో జిల్లాలో 150 సెంటీమీటర్ల వర్షపాతం పడే అవకాశం ఉందని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి చెప్పారు. సోమవారం పునరావాస కేంద్రాలను సందర్శించి విలేకర్లతో మాట్లాడారు. 'ఐఎండీ హెచ్చరికల ప్రకారం మొంథా తుఫాన్ ప్రభావంతో 100 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు పడే ప్రమాదం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తుఫాన్ వీడే వరకు ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలి. జిల్లావ్యాప్తంగా 61 మంది నెలలు నిండిన గర్భిణులకు ఏ సమయంలోనైనా వైద్యం అందించేందుకు వైద్యులు సిద్ధంగా వున్నారు. లంక ప్రాంతాల్లో ముంపు లేకుండా 10 వేల ఇసుక బస్తాలను సిద్ధం చేశాం. 90 సెల్ టవర్లకు జనరేటర్ సౌకర్యం కల్పించాం. కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బ తినకుండా ఒక ఎమర్జెన్సీ టవర్‌ను జిల్లా కేంద్రంలో పెట్టాం' అని వివరించారు.

బయటకు రావద్దు : ప్రసన్న వెంకటేశ్

తుఫాను తీరం దాటే సమయంలో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. ప్రజలు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని ప్రత్యేకాధికారి ప్రసన్న వెంకటేశ్ సూచించారు. ఆయనతోపాటు కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో దాసిరాజు తదితరులు నర్సాపురం, మొగల్తూరు మండలాల్లోని తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించారు. పునరావాస కేంద్రాలకు తరలి వచ్చి అధికారులకు సహకరించాలని ప్రజలను సూచించారు. తీర ప్రాంత గ్రామాల్లోని బాలింతలు, గర్భిణులు, దివ్యాంగులు, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుఫాన్ కారణంగా ఆస్తి, ప్రాణ నష్టాలు లేకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

దూసుకొస్తున్న మొంథా

జిల్లా అంతటా వర్షాలు.. పునరావాస కేంద్రాల ఏర్పాటు

అప్రమత్తమైన అన్నిశాఖల అధికారులు


ఆకివీడులో సిద్ధం చేసిన కొత్త విద్యుత్ స్తంభాలు



నరసాపురంలో సముద్రాన్ని పరిశీలిస్తున్న విప్ నాయకర్.. యలమంచిలిలో దంచికొడుతున్న వాన


పిప్పర రహదారిలో ఎత్తుగా ఎదిగిన కొబ్బరిచెట్లను క్రేన్ సాయంతో తొలగిస్తున్న అధికారులు

పాలకొల్లు టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో రోజంతా వర్షం కురుస్తూనే ఉన్నది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్‌లో వర్షపు నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. హౌసింగ్ బోర్డు కాలనీ, ఎల్ఆర్‌పేట, లక్ష్మీనగర్, శాంతి నగర్, లయన్స్ నగర్, రామారావుపేట, క్రిస్టియన్‌పేట, బ్రాడీపేట పల్లపు ప్రాంతాలు మునిగిపోయాయి. లాకుల వద్ద నుంచి రైలు గేటు, పూలపల్లి వరకు ఆర్అండ్‌బి రోడ్డు వర్షం కారణంగా గోతులు పడ్డాయి.

గణపవరం: మండలంలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో నిరంతరం అందుబాటులో ఉండాలని తహసీల్దార్ వైవీఏ అప్పారావు, ఎంపీడీవో బేబి శ్రీలక్ష్మి ఆదేశించారు. ఇప్పటికే కేశవరంలోని పూరిళ్ల వాసులకు ప్రభుత్వ హైస్కూల్‌లో షెల్టర్లను ఏర్పాటు చేశారు. మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు నిడమర్తి కేశవమూర్తి మంచినీళ్లు, తదితర సదుపాయాలను ఏర్పాటు చేశారు. గణపవరం పిప్పర రహదారిలో బారున ఉన్న కొబ్బరిచెట్లను విద్యుత్ అధికారులు, పోలీసుల సాయంతో తొలగించారు.

తణుకు రూరల్:దువ్వ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వర్షం కారణంగా గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలయమంగా మారాయి. ఎర్ర కాలువ వరద నీరు దువ్వ వయ్యేరులోకి చేరడంతో వయ్యేరు అక్విడెక్ట్ గేట్లను ఎత్తి వేశారు. ఎర్ర కాలువ జలాశయంలో నీటి ప్రవాహం పెరగడంతో సోమవారం ఉదయం 2,500 క్యూసెక్కులు వరద నిటిని దిగువకు విడుదల చేశారు.

యలమంచిలి: రోజంతా ఎడతెరిపిలేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికశాతం ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఎడతెరిపిలేకుండా వర్షం కురవడంతో రహదారులు, పల్లపుప్రాంతాలు జలమయం అయ్యాయి. కొన్నిరోజులుగా కురిసిన వర్షాలకు తోడు, ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తుండటంతో మురుగు కాలువలు, డ్రెయినేజీలు పొంగిపొర్లుతున్నాయి. ప్రజలు అత్యవసర పరిస్థితి ఎదురైతే తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నంబరు 9951578075ను సంప్రదించాలని కోరారు.

ఆచంట:మొంథా తుపాన్ కారణంగా ఆచంటలో సోమవారం ఉదయం నుంచి జోరువాన పడుతూనే ఉంది. ఎడతెడిరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఇప్పటికే తుఫాన్ కారణంగా అధికారులు అప్రమత్తం అయ్యారు. గ్రామాల్లో అధికారులు కాపలా కాస్తున్నారు. పలు చోట్ల పునరావాసకేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద తుఫాన్‌పై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఎంపీడీవో బి. కృష్ణమోహన్ సమావేశం నిర్వహించారు.

ఆకివీడు: ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఫరూఖ్ అన్నారు. సమతానగర్ దగ్గర ఉన్న చెంచుల కాలనీకి చేరుతున్న చినకాపవరం మురుగుకాల్వ నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


తాడేపల్లిగూడెంలో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి.. తణుకులో జూమ్ సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి



తాడేపల్లిగూడెం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం పరిధిలోని అన్ని విభాగాల అధికారులతో సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులను మరింత అప్రమత్తం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

తాడేపల్లిగూడెం కంట్రోల్ రూమ్ నంబర్లు

తాడేపల్లిగూడెం ఆర్డీవో ఆఫీస్ కంట్రోల్ రూమ్ నంబరు 08818-229699, మున్సిపల్ ఆఫీస్ కంట్రోల్ రూమ్ 08818-224188, తహసీల్దార్ కార్యాలయం 63093 16225, పెంటపాడు తహసీల్దార్ కార్యాలయం ఫోన్ నంబర్లు 93926 63566లను అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాలని కోరారు.

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్రకాలువ పరీవాహక గ్రామమైన నందమూరు అక్విడెక్టు ప్రాంతాన్ని ఎమ్మెల్యే బొలి శెట్టి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎర్రకాలువ అధికారులను ఎగువ నుంచి వస్తున్న వరదనీరు విడుదలపై ఆరా తీశారు.

తణుకు/భీమవరం టౌన్/ నరసాపురం/మొగల్తూరు :తుఫాన్ నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశించారు. సోమవారం క్యాంపు కార్యాలయం నుంచి నియోజవర్గంలోని వివిధ శాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా జూమ్ సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అధికారులు జాగ్రత్తగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మంగళ, బుధవారాల్లో తీరం దాటే అవకాశం ఉన్నందున తణుకులో 20 సెంటీమీటర్ల వర్షం కురిసే అవకాశం ఉందని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. భీమవరంలో ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో తన కార్యాలయంలోని 90145 68555, 9441010095లకు సంప్రదించవచ్చునని అన్నారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో తుఫాన్ పునరావాస కేంద్రాలను విప్ నాయకర్, టీడీపీ ఇన్‌ఛార్జీ పొత్తూరి రామరాజు, మత్స్యకార అభివృద్ధి చైర్మన్ కొల్లు పెద్దిరాజు సందర్శించారు. అనంతరం పీఎంలంక వద్ద సముద్రపు ఉధృతిని పరిశీలించారు. తుఫాన్ కారణంగా రెండోవ రోజు మాదవాయిపాలెం, సఖినేటిపల్లి రేవులు మూసివేశారు.తీర ప్రాంతంలో ఐఏఎస్ అధికారి ప్రసన్న వెంకటేష్ పర్యటించారు. ఆయనతో పాటు జిల్లా కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో దాసిరాజు రెవెన్యూ అధికారులు తీర గ్రామాల్లో పర్యటించారు.

మినీ బైపాస్ రోడ్‌లో పడిపోయిన విద్యుత్ స్తంభాన్ని జేసీబీతో సరిచేసి విద్యుత్ సరఫరా చేశారు. తుఫాన్ దృష్ట్యా ముందస్తు చర్యగా కరెంటు స్తంభాలు, జనరేటర్లు, జేసీబీ, కార్మికులను సిద్ధం చేసుకున్నారు. మండలంలో 4019 ఎకరాలకు గాను 1200 ఎకరాలు నీట మునిగాయని వ్యవసాయాధికారి ప్రియదర్శిని తెలిపారు.

పెనుగొండ:మండలంలోని సోమవారం ఉదయం నుంచి చినుకులు పడుతూనే ఉన్నాయి. పనులు చేసుకునేవారు ఇళ్లకే పరిమితం అయ్యారు. పల్లపు ప్రాంతాలు బురదమయంగా మారాయి.

తణుకు:పట్టణంలోని బాలురున్నత పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసినట్లు మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తుఫాన్ వల్ల ఇబ్బందులు కలగకుండా కొండాలమ్మ పుంతరోడ్డులో నివాసం ఉంటున్న పలు కుటుంబాలను పునరావాస కేందానికి తరలించేం దుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. కేంద్రంలో ఆహారం, తాగు నీరు, విద్యుత్ వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచామని వివరించారు. 24గంటలు మునిసిపల్ కార్యాలయంలో కాల్ సెంటర్ నెంబరు 08819-224056 అందుబాటులో ఉంచామని, ప్రజలు ఏసమస్య ఉన్నా తెలియజేయాలని కోరారు.

పాలకోడేరు: గొల్లలకోడేరు, గరగపర్రు, శృంగవృక్షం, మోగల్లు గ్రామాల్లోని పాఠశాలల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ నడుంపల్లి భారతి విజయలక్ష్మి తెలిపారు. వాతావరణంలో సాధారణ మార్పులు వచ్చే వరకు ప్రజలు బయటకు వెళ్ళకుండా ఇంటి వద్దనే ఉండాలని కోరారు.

ఇరగవరం: విద్యుత్, తాగునీరు, రోడ్లు, టెలికాం వంటి సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చొరవ చూపాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక అధికారులతో సమీక్షించారు. తుఫాన్ కారణంగా ఈదురుగాలులకు కరెంటు స్తంభాలు, భారీ వృక్షాలు కూలిపోయే పరిస్థితి ఉందని పంచాయతీ కార్యదర్శులు, విద్యుత్‌శాఖ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. కాగా మండలంలో భారీ వర్షం కురిసింది. పలు చోట్ల ఈదురు గాలులు వీయడంతో కోతకు సిద్ధమవుతున్న వరి చేలు నేల నంటాయి. సూరంపూడి, కె ఇల్లిందలపర్రు, ఇరగవరం, పేకేరు తదితర గ్రామాల్లోని వరి చేలు నీట మునిగాయి. పడిపోయిన దుబ్బులను లేపి కట్టలుగా కట్టుకుంటూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పొలంలో అదనంగా వర్షం నీరు నిలిస్తే వెంటనే బయటకు వెళ్ళేలా బాటలు ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వై రామచేంద్రరావు సూచించారు. తెగుళ్ల సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అత్తిలి: మండలంలో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో పి.శామ్యూల్ తెలిపారు. రక్షిత నీటి సరఫరా, పారిశుధ్యం తదితర సమస్యలపై ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను కోరారు. పాడుబడిన గృహాల్లో నివాసం లేకుండా చూడాలని, పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాని కోరారు.

కాళ్ల: చిన్నపాటి వర్షం చినుకులు తప్ప సోమవారం ఎటువంటి తఫాన్ ప్రభావం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అయితే సోమవారం రాత్రి నుంచి తుపాన్ ప్రభావం ఉధృతంగా ఉండే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కలవపూడి హైస్కూల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జి.సుందర్‌సింగ్, ఎంపీడీవో జి.స్వాతి తెలిపారు. మరోపక్క ఉప్పు టేరు ఉధృతంగా ప్రవహిస్తున్నది.

పాలకొల్లు రూరల్: పాలకొల్లులో రెండు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ తెలిపారు. చింతపర్రులో తాటాకిళ్లు, గుడారులో నివాసం ఉంటున్న 35మందిని పాలకొల్లు బీవీఆర్ఎం స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. వీరికి వసతి, భోజనాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఎంఎంకెఎస్ స్కూల్‌లో రెండవ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఆరుగురిని తరలించారు.

ఉండి: కురుస్తున్న భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలలోని ప్రజలను అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తం చేశారు. సోమవారం చెరుకువాడ లోని యానాదులకాలనీకి సర్పంచ్ కొండవీటి సాంబశివరావు, తహసీల్దారు నాగార్జున వెళ్లారు. కాలనీ వాసులంతా అప్రమత్తంగా వుం డాలని సూచించారు. మహదేవపట్నంలో సర్పంచ్ వనిమావెంకట సుబ్బలక్ష్మీ శ్రీను, జనసేన నియోజక వర్గ ఇన్చార్జు జుత్తుగ నాగరాజు పల్లపు ప్రాంతాలను పరిశీలించారు.

రేపటి నుంచి జ్ఞాన గాయత్రి మహాయజ్ఞం

భీమవరం టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): లోక శాంతి కోసం ఈనెల 29 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు జరిగే 108 కుండముల జ్ఞాన గాయత్రి మహాయజ్ఞ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. సోమవారం భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు నివాసం వద్ద యజ్ఞ కమిటీ ఆధ్వర్యంలో 5 రోజులపాటు జరిగే మహాయజ్ఞ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. పెద అమిరంలోని మాజీ ఎంపీ గోకరాజు గంగ తాతరాజు ప్రాంగణంలో మహాయజ్ఞ కార్యక్రమాలు జరుగుతాయి.

అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ ఫిర్యాదు

భీమవరం క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తాము ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో మరో ఫ్లాట్‌లో ఉంటున్న వ్యక్తి సీసీ కెమెరాలు పెట్టి బెదిరింపులకు గురి చేస్తున్నాడంటూ కె.సుబ్బలక్ష్మి అనే మహిళ టూటౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. సుబ్బలక్ష్మి, మరి కొంత మంది భీమవరం మండలం రాయలం గ్రామంలోని విశిష్ట హైట్స్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. ఆ సమీపంలోనే మరో ఫ్లాట్‌లో ఉంటున్న వెంకటేశ్వర అనే వ్యక్తి ఫ్లాట్ బయట కెమరాలు అమర్చారు. నిత్యం మహిళలు తిరుగుతున్న ప్రదేశాలు రికార్డింగ్ చేసి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఆ వీడియోలను సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరింపులకు గురిచేయడంతో సుబ్బలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

భీమవరం క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తనపై ఒక వ్యక్తి దాడి చేసి గాయపరిచాడంటూ భీమవరం శివారు ప్రకాష్ నగర్‌కు చెందిన ఎలికుల స్వామి అనే వ్యక్తి టూటౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 26వ తేదీ రాత్రి స్వామి కిరాణా షాపునకు వెళ్ళగా అక్కడున్న ఒక వ్యక్తి తనను నిక్‌నేమ్‌తో పిలిచి అన్యాయంగా గొడవ పెట్టుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అనంతరం తనపై దాడి చేయడంతో తీవ్ర గాయాలు అయ్యాయని, తన బంధువులు ఆసుపత్రిలో చేర్చారని ఫిర్యాదు చేశారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు.

గురుకుల విద్యార్థుల తరలింపు

పెనుగొండ, అక్టోబరు27 (ఆం ధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో పెనుగొండ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురు కుల సోషల్ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థులను ముం దస్తుగా ఎస్‌వీకేపీ డాక్టర్ కెఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో హాస్టల్స్‌లోకి తరలించారు. 169 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు ప్రిన్సిపాల్ సుభాషిణి తెలిపారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, భోజనాలు, విద్యుత్, తాగునీరు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఎస్ఐ గంగాధర్ దగ్గరుండి విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, వీఆర్‌వో సతీష్, నాగరాజు ఉన్నారు.

పంట పొలాలు పరిశీలన

పెంటపాడు/అత్తిలి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం సాయంత్రం ముదునూరు, ఆకుతీగపాడు గ్రామాల్లో పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. చేలల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో చీర్ల రవికుమార్, వైస్ ఎంపీపీ కొణతల వెంకట్రావు, సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ బుద్దన ధనరాజు పాల్గొన్నారు. అనంతరం అత్తిలి మండలంలో వెంకటేశ్వర్లు పర్యటించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ తాడేపల్లిగూడెం ప్రాజెక్టు అధికారి టీఎల్ సరస్వతి తెలిపారు. పట్టణంలో 13వ వార్డులోని 27వ రోస్టర్ పాయింట్ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు ఎస్సీ కేటగిరికి రిజర్వేషన్ కేటాయించినట్టు తెలిపారు. అంగన్‌వాడీ సహాయకుల పోస్టు గణపవరం మండలం మొయ్యేరు 1బీసీ బీ, అర్ధవరం ఓసీ, కేశవరం 1 ఓసీ, నవాబుపాలెం 1 ఈడబ్ల్యుఎస్, కొమ్ముగూడెం 3 బీసీ ఏ, అప్పారావుపేట1 ఓసీ, వీఆర్ గూడెం 2 ఓసీ, ఆరుగొలను 1 ఎస్సీ, పెంటపాడు మండలం ముదునూరు 2 ఎస్సీ, వెస్ట్ విప్పర్రు 7 ఓసీ, తాడేపల్లిగూడెం పట్టణంలోని 28వ వార్డు 1 బీసీ ఏ, 20వ వార్డు 3 బీసీ డి, 28వ వార్డు 2 ఓసీ, 6వ వార్డు 1 ఓసీ, 25వ వార్డు 2 ఓసీ రిజర్వేషన్‌లకు కేటాయించినట్టు తెలిపారు. దరఖాస్తులను తాడేపల్లిగూడెం, పెంటపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో నవంబర్ 5 సాయంత్రం 5 గంటల లోపు సంప్రదించాలని సూచించారు.

ఆకివీడు:ఐసీడీఎస్ ప్రాజెక్టులో అంగన్‌వాడీ సహాయకురాళ్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైందని, నవంబరు 5వ తేదీలోపు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని అధికారి వాణి విజయరత్నం తెలిపారు. బొండాడపేట, మహాదేవపట్నంకు బీసీ-బి, ఎస్ఆర్పీ అగ్రహారం, విస్సాకోడేరు కు-ఎస్సీ (గ్రూప్-3), కాళ్ళ బీసీ-డి, మహాదేవపట్నం, ఆకివీడు, పెదపుల్లేరు, మోగల్లుకు- ఓసీలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పదవతరగతి చదువు ఉండాలన్నారు. వికలాంగులు, అంగవైకల్యం కల్గిన వారికి సడలింపు ఉంటుందన్నారు.

పాలకొల్లు రూరల్:వడ్డిపర్రు అంగనవాడీ కర్యకర్త పోస్టుకు, మరో 9 అంగనవాడీల సహాయకురాళ్ల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా సీడీపీవో ఎం.ఉమా కోరారు. వేడంగి, పెనుమదంలోని రేజర్లపేట, పాలకొల్లు అర్బన్ దేవునితోట, వేడంగిశివాలయం రోడ్డు, దగ్గులూరు కందపెరడు, పెనుమర్రు 2, పెదలంక 2, చించినాడ 4, ఆర్యపేట 1లలోని అంగనవాడీ కేంద్రాల్లో సహాయకురాలు పోస్టులకు నవంబరు 11లోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలు కోసం పాలకొల్లు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు

భగవన్నారాయణకు నివాళులు

భీమవరం టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భీమవరం రెండో పట్టణంలోని ట్యాక్సీ స్టాండ్ వద్ద భీమవరం టాక్సీ ఓనర్స్‌అండ్ డ్రైవర్స్ సంక్షేమ సంఘం దివంగత అధ్యక్షుడు వేగి శ్రీభగవన్నారాయణ సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరత్నం, కార్యదర్శి ఆకుల శ్రీను, కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. ట్యాక్సీ డ్రైవర్ల సంక్షేమం కోసం సుమారు రూ.6 లక్షలతో భగవాన్ చారిటబుల్ ట్రస్టును వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.

బూరాడ శ్రీనివాస్‌కు పితృవియోగం


కేశవరావు (ఫైల్)

పెంటపాడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ముదునూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు, జనసేన నాయకుడు బూరాడ శ్రీనివాస్‌కు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి బూరాడ కేశవరావు (70) గుండె పోటుతో మృతి చెందారు. అందరితోనూ సౌమ్యంగా ఉండే ఆయన మరణించడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. పలువురు ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు.

ప్రగతి విద్యార్థినికి అభినందన


సాయి మహతిని అభినందిస్తున్న ఆరిమిల్లి

తణుకు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక విభాగాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ప్రగతి జూనియర్ కాలేజ్‌కి చెందిన ఏలూరిపాటి సత్య లలితా సాయి మహతికి హరికథా విభాగంలో జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనందున సత్కరించారు. ఈ నెల 22,23 తేదీలలో విజయవాడలో కళా ఉత్సవ్ 2025 పేరిట పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సాయి మహతి ప్రథమ స్థానంలో నిలిచింది. ఎమ్మెల్యే ఆరిమిల్లి, ప్రగతి విద్యాసంస్థల డైరెక్టర్ ఎంఎస్ఆర్ ఆంజనేయులు (ప్రగతి రాజా), ప్రిన్సిపాల్ జి.రవికుమార్ సోమవారం విద్యార్థిని అభినందించారు.

ఘనంగా నానాజీ జయంతి

పెనుగొండ, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి):పెనుగొండకు చెందిన జమీందారి కుటుంబీకులు కూనపరెడ్డి లక్ష్మయ్యానాయుడు (నానాజీ) జయంతి సందర్భంగా సోమవారం పెనుగొండలో కేక్ కట్ చేసి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా మినర్వా థియేటర్ వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తోట మెహర్, సూర్నీడి కృష్ణ, బండారు నాయుడు, గాజుల బుల్లి పుల్లారావు, పోడూరి రామయ్య పాల్గొన్నారు.

మూతపడ్డ సొసైటీలు

తణుకు రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):సహకార ఉద్యోగులు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలలో భాగంగా సోమవారం తణుకు మండలంలోని సొసైటీలు మూతపడ్డాయి. సహకారం ఉద్యోగుల కోసం విడుదల చేసిన 38వ జీవోను వెంటనే అమలు చేయాలని, సహకార ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, 2019 తర్వాత విధుల్లో చేరిన వారిని పర్మినెంట్ చేయాలని తదితర డిమాండ్లతో ఆందోళన చేయడానికి విజయవాడ తరలి వెళ్ళారు. ఈ నేపథ్యంలో మండలంలోని సహకార సొసైటీలు మూత పడ్డాయి.

విజయవాడ తరలిన సొసైటీ ఉద్యోగులు


రైలులో విజయవాడ వెళ్లుతున్న సొసైటీ ఉద్యోగులు

నరసాపురం రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలంటూ సోమవారం సహకార సంఘాల ఉద్యోగులు విజయవాడ బయలుదేరి వెళ్లారు. ఉదయం నరసాపురం రైల్వేస్టేషన్‌కు డివిజన్ పరిధిలోని సొసైటీల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. అక్కడ నుంచి వీరంతా విజయవాడ ఆప్కాబ్ కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు బయలుదేరి వెళ్లారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని సొసైటీల్ని బంద్ చేసి ఆందోళనలో పాల్గొనేందుకు తరలివెళ్లారు.

నేటి నుంచి సీఐటీయూ జిల్లా మహాసభలు

పెంటపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఈ నెల 28,29 తేదీలలో పెనుగొండ శ్రీలక్ష్మీజనార్దన స్వామి కళ్యాణ మండపంలో జరుగుతున్న సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు సిరపరపు రంగారావు, చిర్లా పుల్లారెడ్డి, బంకూరు నాగేశ్వరరావు కోరారు.